

త్రివర్ణ శోభితమైన శ్రీశైలం డ్యాం

జలమే దైవం!



'రాయలేలిన రాయలసీమను రతనాల సీమగా మారుస్తాం. సీమలో జలవనరులను పెంచి రైతాంగాన్ని ఆదుకుంటాం. పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో రెండు దేవాలయాలు ఉన్నాయి. ఒకటి మల్లన్న స్వామి.. రెండు ప్రాణాధారమైన శ్రీశైలం జలాశయం. నీళ్ల ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. జలం లేకపోతే కష్టమే. ఒక్కమాటలో చెప్పాలంటే జలమే దైవం..'

- సీఎం నారా చంద్రబాబు నాయుడు

- సీమను రతనాల సీమగా మారుస్తాం
- పక్కాగా సూపర్-6 హామీల అమలు
- పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం
- పండ్లతోటల పెంపకానికి సబ్సిడీలు
- ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు
- శ్రీశైలం నుంచి గేట్లెత్తి నీటి విడుదల
- కృష్ణా జలాలకు జలహారతి
- మల్లన్న సేవలో సీఎం

నంద్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేనివిధంగా రాయలసీమలో అనేక సదుపాయాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామన్నారు. ప్రసుత్తం ఆహారపు అలవాట్లు మారాయని.. అందుకు తగినట్టుగా పండ్లకు డిమాండ్ పెరిగిందన్నారు. ఆదిశగా రాయలసీమలో గతంలో మాదిరిగా 90శాతం సబ్సిడీతో డ్రిప్ సదుపాయం కల్పించి పండ్ల తోటల పెంపకం పెంచుతామన్నారు. శ్రీశైలంలో మంగళవారం సీఎం చంద్రబాబు పర్యటించారు. ముందుగా శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. ముందుగా ఆయన సాక్షి గణపతిని దర్శించుకున్నారు. తర్వాత ప్రధాన ఆలయం వద్దకు సీఎం రాగానే అధికారులు, ఆలయ అర్చకులు పూర్ణకుంభస్వాగతం పలికారు. ధ్వజస్తంభానికి నమస్కరించి శ్రీశైల మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, అర్చకులు సీఎంను ఘనంగా సత్కరించి, ఆలయ జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆయన రోడ్డు మార్గం ద్వారా సున్నిపెంటకు చేరుకున్నారు. అక్కడ శ్రీశైలం జలాశయంలో కృష్ణా జలాలకు జలహారతి ఇచ్చి, గంగమ్మ తల్లికి సారెను సమర్పించారు. అనంతరం శ్రీశైలం రిజర్వాయర్ నాలుగు గేట్లను ఎత్తి కృష్ణా జలాలను దిగువన సాగర్‌కు విడుదల చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు సున్నిపెంటలోని ప్రజావేదిక వద్దకు చేరుకున్నారు. అక్కడ స్థానికులు, రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. గోదావరి జలాలతో రాయలసీమను సస్యశ్యామలం చేస్తామన్నారు. పోలవరం కుడి కాలువతోనే నేటికి సీమకు నీళ్లు వస్తున్నాయన్నారు. కృష్ణా డెల్టాకు గోదావరి నీళ్లు 120 టీఎంసీలు వాడి.. ఆ మిగులు జలాలను సీమకు ఇస్తున్నామని గుర్తు చేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే.. ఏపీకి పోలవరం ఒక వరం అన్నారు. అంతేకాకుండా తెలుగు గంగ, కేసీ కెనాల్, ఎస్ఆర్‌బీసీ, నగరి, గాలేరు,


మిగతా 6లో...


గంగమ్మ తల్లికి సారె సమర్పిస్తున్న సీఎం చంద్రబాబు


గో సేవలో సీఎం






నాలుగు గేట్ల ద్వారా దిగువకు కృష్ణమ్మ


నారా చంద్రబాబునాయుడును ఆశీర్వదిస్తున్న వేదపండితులు


సీఎంకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఎమ్మెల్యే, ఆలయ అధికారులు

మధ్యవర్తిత్వంతో సత్వర న్యాయం

- జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది


శిక్షణా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది

కర్నూలు లీగల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులు తమ కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వాన్ని అంగీకరిస్తే సత్వర న్యాయాన్ని పొందవచ్చని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది తెలియజేశారు. మధ్యవర్తిత్వంపై ఉమ్మడి కర్నూలు జిల్లాలోని న్యాయవాదులకు, ఎన్జీవోలకు స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని కోర్టులలో ఈ మధ్యవర్తిత్వంపై ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మధ్యవర్తిత్వాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు న్యాయవాదులకు, ఎన్జీవోలకు ఈ శిక్షణా శిబిరం ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. న్యూఢిల్లీ, మధ్యప్రదేశ్‌ల నుంచి వచ్చిన అనూజా సక్సేనా, లీనాకరే మధ్యవర్తిత్వంపై శిక్షణ ఇస్తారని తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గంగా సివిల్ ప్రొసీజర్ కోడ్ లోని సెక్షన్ 89 కింద మధ్యవర్తిత్వానికి వీలుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్ చౌదరి, ఉమ్మడి జిల్లాలోని న్యాయవాదులు, ఎన్జీవోలు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ ఎక్స్‌లెన్స్ దిశగా తపాలా సేవలు

- పోస్టుమాస్టర్ జనరల్ డాక్టర్ ఉపేందర్

కర్నూలు న్యూసిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తపాలా శాఖలో సేవలు డిజిటల్ ఎక్స్‌లెన్స్ దిశగా వెళ్తున్నాయని రాయలసీమ జోన్ పోస్టుమాస్టర్ జనరల్ డాక్టర్ వెన్న ఉపేందర్ అన్నారు. భారత ప్రభుత్వం తపాలా శాఖలో చేపట్టిన ఆధునికీకరణలో భాగంగా చేపట్టిన ఏపీటీ(అడ్వాన్స్ పోస్టల్ టెక్నాలజీ) 2.0ను మంగళవారం ప్రధాన తపాలా కార్యాలయంలో పీఎంజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ ఏపీటీ అప్లికేషన్‌ను వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వేగవంతమైన, మెరుగైన సేవలు అందించడానికి ఏపీటీ 2.0 రోల్ అవుట్‌ను రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సూపరింటెండెంట్ జి. జనార్దన్‌రెడ్డి, రీజినల్ పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగానాయక్, హెడ్ పోస్టుమాస్టర్ సి. రాజేశ్వరి, పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీఎంజీ ఉపేందర్

సుంకేసులకు జలశోభ



- క్రస్ట్‌గేట్లు దాటి తుంగభద్ర పరుగులు
- బ్యారేజీకి 61 వేల క్యూసెక్కుల వరద
- 21 గేట్లెత్తి శ్రీశైలానికి 63,264 క్యూసెక్కులు విడుదల
- జల అందాలు వీక్షించి పరవశిస్తున్న ప్రకృతి ప్రేమికులు

తుంగభద్రమ్మ పరవళ్లు తొక్కుతోంది. సుంకేసులు బ్యారేజీ జల అందాలు సంతరించుకుంది. ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుండడంతో సుంకేసుల వద్ద సందడి నెలకొంది. తుంగభద్ర అందాలను వీక్షించేందుకు నగర వాసులు పెద్ద ఎత్తున రైల్వే బిడ్జి, నేషనల్ హైవే, సంకల్ బాగ్ ప్రాంతాలకు చేరుకుంటున్నారు. సెల్ఫీలతో సందడి చేస్తున్నారు. ఎగువన ఆర్డీఎస్ ఆనకట్టపై వరద పోటెత్తింది. మంత్రాలయం రాఘవేంద్రుడి సన్నిధానం చెంత పరుగులు పెడుతోంది. కన్నడ రాజ్యంలో తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్ల దాటి 61,145 క్యూసెక్కుల వరద కర్నూలు వైపు పరుగులు పెడుతోంది.

కర్నూలు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల సంయుక్త జలాశయం తుంగభద్ర డ్యాం ముందస్తు వరదలతో పదేళ్ల రికార్డు సొంతం చేసుకుంది. గరిష్ఠ నీటి మట్టం 1633 అడుగులు, పూర్తి స్థాయి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా.. గతేడాది 19వ గేటు కొట్టుకుపోవడం, గేట్లు పటుత్వం తగ్గిపోవడంతో డ్యాం సేఫ్టీ నిపుణుల సూచన మేరకు 80 టీఎంసీలే నిల్వ చేయాలని టీబీపీ బోర్డు నిర్ణయించిన సంగతి తెలిసిందే. మంగళవారం 51,500 క్యూసెక్కులు వరద కొనసాగుతుండగా, 75.93 టీఎంసీలు నిల్వ చేసి 21 క్రస్ట్‌గేట్లు ఎత్తి 61,145 క్యూసెక్కులు దిగువకు వదిలేస్తున్నారు. కర్నూలు జిల్లా కౌతాళం మండలం మేళిగనూరు చెంత తెలుగింట అడుగు పెడుతుంది. ఆర్డీఎస్ ఆనకట్ట వరద పరవళ్లతో పోటెత్తింది. మంత్రాలయం రాఘవేంద్రస్వామి క్షేత్రం దాటి నందవరం, సి.బెళగల్ మండలాలు మీదుగా సుంకేసుల బ్యారేజీ చేరుకుంది. బ్యారేజీకి 61 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సామర్థ్యం 1.20 టీఎంసీలే. దీంతో 21 గేట్లెత్తి 63,264 క్యూసెక్కులు దిగువన శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. కర్నూలు నగరం దాటి సంగమేశ్వరం చెంత తుంగభద్రమ్మ కృష్ణమ్మ జలఒడిలో సంగమం అవుతోంది. సుంకేసుల బ్యారేజీ వద్ద పెద్దగా నీటి నిల్వ లేకపోయినా.. విశాలంగా వరద ప్రవహిస్తుండడంతో

మిగతా 6లో...

నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు బదిలీ

- నూతన కమిషనర్‌గా పి.విశ్వనాథ్


నూతన కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్. రవీంద్రబాబు అనంతపురం రీజినల్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు అనంతపురం రీజినల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పి. విశ్వనాథ్‌ను నగర పాలక సంస్థ కమిషనర్‌గా నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎస్. సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో బాధ్యతలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఇక్కడికి కమిషనర్‌గా వస్తున్న పి.విశ్వనాథ్ స్వస్థలం చిత్తూరు జిల్లా మదనపల్లి. ఈయన 2007 బ్యాచ్ గ్రూప్-1 అధికారిగా నల్గొండ జిల్లా సూర్యాపేట కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. గత సెప్టెంబరులో అనంతపురం రీజినల్ డైరెక్టర్‌గా బదిలీపై వచ్చారు. ప్రస్తుతం కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్‌గా రానున్నారు.

బీఎల్వోలకు శిక్షణ పూర్తి చేయండి

- కలెక్టర్ పి. రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం నుంచి 17వ తేదీ వరకు బీఎల్‌వోల శిక్షణ పూర్తి చేయాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా ఈఆర్వోలను ఆదేశించారు. మంగళవారం పీ-4 పాలసీ, మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్, తల్లికి వందనం, పీఎం సూర్యఘర్, ఇంటింటి చెత్త సేకరణ, పారిశుధ్యం, బీఎల్‌వోలకు ట్రైనింగ్ అంశాలపై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 10న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 2.0లో ఎలాంటి లోటుపాట్లుకు తావు లేకుండా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ పక్కాగా జరగాలని అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులకు, తల్లిదండ్రులకు, పూర్వ విద్యార్థులకు అందరికీ ఆహ్వానాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీ-4 పాలసీలో భాగంగా జిల్లాలో నిర్దేశించిన 50,701 బంగారు కుటుంబాలను 10 రోజుల్లోపు దత్తత తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకం కింద 8484 దరఖాస్తులు రిజిస్టర్ కాగా, ఇందులో 652 మాత్రమే పూర్తి చేశారనీ మిగిలిన లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జేసీ నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, ఆర్డీవోలు సందీప్ కుమార్, భరత్ నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనతోనే అభివృద్ధి : తిక్కారెడ్డి 6
పేరెంట్స్ కమిటీలకు రూ.3.30 కోట్లు విడుదల
కర్నూలు జీజీహెచ్‌లో ఉద్యోగాలకు నోటిఫికేషన్ 6


డోలు మేళాలతో స్వాగతం




ప్రాజెక్టు వద్దకు చేరుకున్న రైతులు, ప్రజలు, నాయకులు


టెంకాయ కొడుతున్న సీఎం


సీఎంకు తిలకం పెడుతున్న అర్చకుడు




సీఎంకు స్వాగతం పలుకుతున్న నంద్యాల కలెక్టర్ రాజకుమారి, మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి

జలమే దైవం!

5వ పేజీ తరువాయి

హంద్రీనీవా కింద ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. కులం, మతం, ప్రాంతం అడ్డు వస్తే ప్రజలకు ఎలాంటి మంచి జరగదన్నారు. మంచి చేసే ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. సున్నిపెంటకు రాగానే.. తల్లులు, చిన్న పిల్లలతో సహా విక్టరీ సింబల్ చూపిస్తుంటే తనకు ఎంతో సంతోషం వేసిందన్నారు. గత పాలకులు ఎవరైనా నవ్వితే తిట్టేవారు.. కొట్టేవారన్నారు. కానీ ఇప్పటి పాలకులు నవ్వించే వారని గుర్తు చేశారు.

భూగర్భ జలాలను పెంచుకుందాం

సంక్షేమం.. అభివృద్ధి దిశగా సాగాలంటే నీటి సంపద మరింత పెంచుకోవాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. గతంలో సాగునీటి సంఘాలు, డ్వాక్రా, విద్యాకమిటీలను తానే తీసుకొచ్చానన్నారు. రాష్ట్రంలో 6,047 సాగునీటి సంఘాలు, 267 పంపిణీ కమిటీలు, 58 ప్రాజెక్టు కమిటీలున్నాయన్నారు. ఈ కమిటీలతో త్వరలో అమరావతిలో ప్రత్యేక సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేస్తామన్నారు. ఎక్కడికక్కడ భూగర్భ జలాలను సైతం పెంచుకునే విధంగా చైతన్య పరుస్తామన్నారు. రైతులకు పీఎం కుసుమ్ పథకం కింద సోలార్ పంపుసెట్లు కూడా అందజేస్తామన్నారు.

సూపర్-6 హామీలపై..


ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేస్తామని చంద్రబాబు అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నెలకు రూ.4వేలు పింఛన్ ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రూ.వెయ్యి పెంచేందుకు ఐదేళ్ల సమయం తీసుకుందన్నారు. తల్లికి వందనం పథకం విజయవంతమైందన్నారు. ఈ నెలలో రైతులకు అన్నదాత సుఖీభవ జమ చేస్తామన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్నారు. అనేక మంది పేదల ఆకలి తీర్చడానికి 204 అన్నక్యాంటీన్లు పెట్టామన్నారు. భవిష్యత్‌లో అన్ని దేవాలయాల్లోనూ నిత్య అన్నదాన సత్రాలు ఏర్పాటు చేస్తామన్నారు.

సీఎం రాకతో సందడి

శ్రీశైలం జలాశయం నీటి విడుదల నేపథ్యంలో సీఎం చంద్రబాబు రాకతో.. శ్రీశైలంలో సందడి వాతావరణం నెలకుంది. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైతం పెద్దఎత్తున శ్రీశైలానికి తరలివచ్చారు. సున్నిపెంటలోని హెలిప్యాడ్ నుంచి ఆలయం.. జలాశయం వరకు జనాలు బారులుదీరారు. వృద్ధులు, మహిళలు, యువత సీఎం చంద్రబాబుకు అభివాదం చేశారు. ఇదిలా ఉండగా ముందుగా సీఎం సున్నిపెంటలో హెలిప్యాడ్ దిగగానే మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికార యంత్రాంగం పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

పటిష్ట బందోబస్తు

సీఎం చంద్రబాబు శ్రీశైలం పర్యటన విజయవంతమైంది. ఉదయం 12 గంటల నుంచి సాయంత్రం 3.25 గంటల వరకు సీఎం శ్రీశైలంలోనే ఉన్నారు. ఇదే క్రమంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం 3.40 గంటలకు సీఎం హెలిప్యాడ్ ద్వారా అమరావతికి వెళ్లారు. చంద్రబాబు వెంట రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి, డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, నంద్యాల కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా, జేసీ విష్ణుచరణ్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, గిత్త జయసూర్య, భూమా అఖిలప్రియ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఆర్డీఓ చల్లా విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.


స్వామివారి ప్రసాదం స్వీకరిస్తున్న సీఎం


చంద్రబాబుతో మంత్రి నిమ్మల


స్వాగతం పలుకుతున్న నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా


హోమం వద్ద పూజలు చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు


జల హారతి ఇస్తున్న సీఎం..


ప్రాజెక్టు వద్దకు వస్తున్న నారా చంద్రబాబునాయుడు


పెద్ద పులి చిత్రపటాన్ని అందజేస్తున్న నాయకులు

హిట్ అండ్ రన్ కేసులపై ప్రత్యేక చర్యలు తీసుకోండి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి


హిట్ అండ్ రన్ కేసులపై ప్రసంగిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి

కర్నూలు లీగల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న హిట్ అండ్ రన్ కేసులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి కోరారు. మంగళవారం స్థానిక న్యాయ సేవా సదన్ భవన్‌లో హిట్ అండ్ రన్ కేసులపై జిల్లా స్థాయి మానిటరింగ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిట్ అండ్ రన్ కేసులలో బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు అధికారులు కృషి చేయాలని, ఈ కేసులను నివారించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన రెవెన్యూ, ట్రాన్స్‌పోర్ట్, మెడికల్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కర్నూలు జీజీహెచ్‌లో ఉద్యోగాలు

43 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పోస్టులకు నోటిఫికేషన్

కర్నూలు హస్పిటల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉన్న 43 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఏడాది పాటు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉండే ఈ పోస్టులకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేశామన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల అధికారిక వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచామన్నారు. దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 9 నుంచి 16వ తేదీ వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య (ఈ నెల 13న సెలవు దినం మినహా) ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు ప్రాతిపదికన ఫిజియోథెరపీస్టు-2, స్పీచ్ థెరపీస్టు-2, సి.ఆర్మ్ టెక్నీషియన్-2, ఓటీ అసిస్టెంట్లు-2, ఈసీజీ టెక్నీషియన్లు-2, డయాలసిస్ టెక్నీషియన్లు-2, ఆడియోమెట్రి టెక్నీషియన్లు-1, ఔట్ సోర్సింగ్ పోస్టుల్లో జనరల్ డ్యూటీ అటెండర్-8, ఎంఎన్‌వోలు-11, ఎఫ్ఎంవోలు 11 పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు.

నేడు సార్వత్రిక సమ్మె

కర్నూలు న్యూసిటీ, జూలై 8(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు బుధవారం దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ సంఘాలు ఉదయం నుంచే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసనలు తెలుపుతాయి. నగరంలోని ప్రధాన కూడళ్లు, ఆటోలు, బస్సులను బంద్ చేయించాలని కార్మిక నాయకులు విజ్ఞప్తి చేశారు.

రేపు మద్దిలేటి స్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు

బేతంచెర్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రంలో ఈ నెల 10న ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈవో రామాంజ నేయులు మంగళవారం తెలిపారు. వేడుకల్లో మహాలక్ష్మి అమ్మవారి మూలవిరాట్‌ను వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పలు రకాల ఫలాలు, పుష్పాలతో అలంకరించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పలు విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. అమ్మవారికి శ్రీలలితా సహస్ర నామ కుంకుమార్చన ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ అక్కా తమ్ముళ్లు అసాధ్యులు

- కత్తి పోటీల్లో జాతీయస్థాయికి ఎంపికైన గ్రామీణ విద్యార్థులు
- రికార్డు స్థాయిలో బంగారు, స్వర్ణ పతకాలు
- జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన ఆశ్రిత, అజిత్


జాతీయ స్థాయికి ఎంపికైన అక్క, తమ్ముడు

చాగలమర్రి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఈ అక్కా తమ్ముళ్లను చూస్తే ముచ్చటేస్తుంది. ఇద్దరికీ కత్తి పోటీల్లో తిరుగు లేదు. చాగలమర్రి గ్రామంలో పుట్టి పెరిగి కత్తి పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. చేతుల నిండా పతకాల పంట పండిస్తున్నారు. తల్లిదండ్రులు ఇద్దరు పీడీలు. వారిని ఆదర్శంగా తీసుకున్న పిల్లలు బంగారు, స్వర్ణ పతకాలను సాధించారు. గ్రామంలోని చంద్ర ఓబుళరెడ్డి, ఆశాజ్యోతిరెడ్డి ఇద్దరు ప్రభుత్వ పీడీలు. చంద్ర ఓబుళరెడ్డి కడప జిల్లా రాజపాలెం మండలం వెలువలి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విధుల నిర్వహిస్తున్నారు. ఆశాజ్యోతిరెడ్డి చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. కుమార్తె అశ్రిత రెడ్డి చాగలమర్రిలోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. కుమారుడు అజిత్‌రెడ్డి 7వ తరగతి చదువుతున్నాడు. వీరు రాష్ట్ర, జాతీయస్థాయి పెన్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపుతూ పతకాలు కైవసం చేసుకుంటున్నారు.

సాధించిన పతకాలు ఇవే..

2022లో ఒంగోలులో జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో స్వర్ణం సాధించి అశ్రితరెడ్డి జాతీయస్థాయికి ఎంపికైంది.

2022 ఆగస్టులో మహారాష్ట్రలోని నాసిక్ పట్టణంలో మినీ నేషనల్ పోటీల్లో ప్రశంసా పత్రాన్ని దక్కించుకుంది.

2022లో 66వ స్కూల్‌గేమ్స్‌లో పాల్గొని రాష్ట్రస్థాయిలో స్వర్ణ పతకం సాధించింది.

2023లో 67వ స్కూల్ గేమ్స్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకం సాధించి జాతీయస్థాయికి ఎంపికైంది.

2023లో ఛత్తీస్‌ఘడ్‌లోని జగదల్‌పూర్‌లో జరిగిన జాతీయస్థాయి పెన్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రశంసా పత్రం దక్కించుకుంది.

అండర్ 14 బాలికల విభాగంలో స్కూల్ గేమ్స్ ఫెన్సింగ్ క్రీడల్లో 28న కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థాయంలో రాణించి జాతీయస్థాయికి ఎంపికైంది.

2024 నవంబరు నెలలో జమ్ముకాశ్మీర్‌లో జరిగిన 68వ జాతీయ స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకం కైవసం చేసుకుంది.

వలంపిక్స్‌లో దేశం తరఫున పాల్గొనాలనే లక్ష్యంతో ప్రస్తుతం చెన్నైలో ప్రత్యేక శిక్షణ పొంది పోటీలకు సిద్ధంగా ఉంది.

● జాతీయస్థాయికి ఎంపికైన అజిత్‌రెడ్డి

ఫెన్సింగ్ పోటీల్లో సత్తా చాటుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో స్వర్ణ బంగారు పతకాలను కైవసం చేసుకొని అజిత్‌రెడ్డి తోటి విద్యార్థుకు ఆదర్శంగా నిలిచాడు.

విజయవాడలో 29న జరిగిన అండర్12 స్టేట్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని బంగారు పతకం సాధించాడు.

2025 జూలై 5న అండర్ 12 నేషనల్ చాంపియన్‌షిప్ మహారాష్ట్రలోని నాసిక్ పట్టణంలో జరిగే ఫెన్సింగ్ పోటీలకు సిద్ధమయ్యాడు.

2024 జూన్‌లో ఒడిసాలోని కటక్‌లో నిర్వహించిన జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపాడు.

2024లో నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

2024 నవంబరులో జమ్ముకాశ్మీర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచాడు.

2023లో కాకినాడాలో రాణించి రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించాడు.

2022లో ఒంగోలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించి జాతీయస్థాయి ఎంపికయ్యారు.

మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహించిన జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి ప్రశంసా పత్రాన్ని పొందారు.

భారతదేశం తరఫున వలంపిక్స్‌లో పాల్గొని బంగారు పతకం సాధించడమే లక్ష్యమని అజిత్‌రెడ్డి అంటున్నాడు.

● స్వర్ణ, బంగారు పతకాలు సాధిస్తున్న అశ్రితరెడ్డి, అజిత్‌రెడ్డిలను ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, హెచ్ఎం స్మిత, వ్యాయామ ఉపాధ్యాయులు, ఎస్టీయూ, పీఆర్టీయూ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.

సుపరిపాలనతోనే అభివృద్ధి

● **టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి**

కర్నూలు అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమంలో అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అరాచక శక్తులను ఉసిగొల్పి అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు నిర్వహిస్తున్న ఇంటింటి కార్యక్రమంలో వారి అరాచకాలను ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ సందర్భంగా టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు జిల్లా అధ్యక్షుడిని కలిశారు. నామినేటెడ్ పదవుల్లో తమకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం రుద్రవరం గ్రామంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో వీపీవీ సుబ్బయ్య, సురేష్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

డీఏపీ, యూరియా కొరత లేకుండా చర్యలు

● **డీసీఎంఎస్ ఛైర్మన్ నాగేశ్వరరావు**

నందికొట్కూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా, డీఏపీ కొరత లేకుండా రైతులను ఆదుకుంటామని డీసీఎంఎస్ ఛైర్మన్ నాగేశ్వర యాదవ్ అన్నారు. మంగళవారం నందికొట్కూరు మార్కెట్ యార్డుకు వచ్చిన ఎరువుల బస్తాలను ఆయనతో పాటు నందికొట్కూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సకాలంలో డీఏపీ, యూరియాలను అందిస్తామన్నారు. అందుకు సంబంధించిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనలు, అపోహలు పెట్టుకోకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ రబ్బాని, నందికొట్కూరు మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ సుధాకర్ యాదవ్, టీడీపీ నాయకులు సర్వోత్తమరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులకు జలశోభ

5వ పేజీ తరువాయి


నిండు కుండలా తుంగభద్ర డ్యాం

ఆ అందాలను వీక్షించేందుకు ఇటువైపు కర్నూలు జిల్లా, అటు వైపు జోగులాంబ గద్వాల జిల్లాలకు చెందిన పలు గ్రామాల ప్రకృతి ప్రేమికులు తరలి రావడంతో సందడి నెలకొంది.

14న కేసీ కెనాల్‌కు సాగునీరు

తుంగభద్ర వరదతో సుంకేసుల పోటెత్తినా కేసీ కాలువకు సాగునీరు ఇవ్వడం లేదు. అయితే.. కర్నూలు జిల్లాలో 3,763 ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉంది. దీంతో ఈ నెల 14న కేసీ కాలువకు సాగునీరు విడుదల చేయాలని సోమవారం కలెక్టర్ పి. రంజిత్‌బాషా అధ్యక్షతన జరిగిన ఐఏబీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఆ దిశగా కేసీ కెనాల్ ఇంజనీర్లు సన్నహాలు చేస్తున్నారు. కాలువ గేట్లు మరమ్మతులు చేస్తున్నారు. నగరం పరిధిలో కేసీ దుర్గంధం వెదజల్లుతోంది. నీరు విడుదల చేస్తే మురుగు కొట్టుకుపోయి దుర్గంధం నుంచి ఉపశమనం కలుగుతుందని నగరవాసులు పేర్కొంటున్నారు.

రేపు ఎల్లెల్సీకి..

జిల్లాలో టీబీపీ ఎల్లెల్సీ కింద ఈ ఏడాది ఖరీఫ్‌లో 35 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని, ఈ నెల 10 నుంచి తుంగభద్ర డ్యాం నుంచి కాలువకు సాగునీరు విడుదల చేయాలని ఐఏబీ సమావేశంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈమేరకు టీబీపీ బోర్డుకు జిల్లా ఇరిగేషన్ ఇంజనీర్లు ఇండెంట్ ఇచ్చారు. టీబీ డ్యాం నుంచి ఏపీ సరిహద్దుకు చేరడానికి ఐదారు రోజులు పడుతుందని అంచనా. 18వ తేదీ నుంచి ప్రధాన కాలువ నుంచి పంట కాలువలకు సాగునీరు ఇచ్చేందుకు ఇంజనీర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో ఆయకట్టు రైతులు వరి, మిరప, పత్తి.. వంటి పంటలు సాగుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

పేరెంట్స్ కమిటీలకు రూ.3.30 కోట్లు విడుదల

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్టేట్ ప్రాజెక్టు ఆదేశాల మేరకు కాంపోజిట్ గ్రాంట్స్ 1406 పాఠశాలలకు రూ.3.30 కోట్లు విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ మంగళవారం తెలిపారు. 983 పాఠశాలలకు గ్రాంట్ వారి పీఎఫ్ఎంఎస్ అకౌంటులో జమ అయ్యాయని అన్నారు. మిగతా 423 పాఠశాలల అకౌంట్స్ ఇన్‌యాక్టివ్ ఉండటం వల్ల వారి ఖాతాలో జమ కాలేదన్నారు. వారి అకౌంట్లు ఈ నెల 9వ తేదీ ఉదయం 11 గంటలలోపు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యూనియన్ బ్యాంకులో కలిసి ఖాతాలను యాక్టివేట్ చేసుకున్న గంటలోపే వారి ఖాతాల్లో కాంపోజిట్ గ్రాంట్స్ జమ అవుతుందన్నారు. ఇలా జమ అయిన మొత్తం నుంచి పది శాతం ఈ నెల 10న జరిగే మెగా పీటీఎంకు వినియోగించుకోవాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

ఎస్సీ విద్యార్థులు పోస్టల్ ఖాతా తెరవాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి రెండో విడత తల్లికి వందనం ప్రభుత్వం విడుదల చేస్తుందని, దీనికి ఎస్సీ విద్యార్థులు పోస్టల్ ఖాతా తెరవాలని ఎస్సీ సంక్షేమ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి రాధిక అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థులు తప్పనిసరిగా పోస్టల్ బ్యాంకు అకౌంటు తెరవాలన్నారు. ఈ ఖాతాను ఎన్‌పీసీఐ లింక్ చేసుకోవడం ద్వారా మాత్రమే తల్లికి వందనం పథకం ప్రయోజనాలు పొందుతారన్నారు. ఈ సమాచారాన్ని విద్యాశాఖ అధికారులు విద్యార్థులు, కళాశాలల యజమాన్యాలు గమనించాలని పేర్కొన్నారు.

ప్రకృతి సేద్యం చేయండి

- ఈ సంవత్సరం లక్ష్యం 1,32,514 ఎకరాల్లో సాగు
- జిల్లా ప్రకృతి వ్యవసాయం మేనేజర్ మాధవి



కర్నూలు అగ్రికల్చర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైతులు లాభాల బాట పట్టాలంటే ప్రజలకు నాణ్యమైన ఆహార పంట ఉత్పత్తులు అందుబాటులోకి రావాలంటే ప్రకృతి సేద్యం ద్వారానే పంటల సాగు జరగాలని కర్నూలు జిల్లా ప్రకృతి వ్యవసాయం మేనేజర్ మాధవి తెలిపారు. మంగళవారం కర్నూలు నగరంలోని జడ్‌బీఎన్‌ఎఫ్ కార్యాలయంలో మేనేజర్ మాధవి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం 53,456 మంది రైతులతో 1,32,514 ఎకరాల్లో ప్రకృతి సేద్యం ద్వారా పంటల సాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించి లక్ష్యాన్ని చేరుకుంటామని స్పష్టం చేశారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకొని ప్రకృతి సేద్యం చేస్తే సాగు ఖర్చులు చాలా వరకు తగ్గిపోతాయన్నారు.

కడుపు నొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

కోవెలకుంట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం మండల పరిధిలోని సౌదరిదిన్నె గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సూర్య చంద్రుడు(36) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడేవాడు. ఎన్ని ఆసుపత్రుల్లో చూపించినా కడుపు నొప్పి తగ్గలేదు. అయితే మంగళవారం ఉదయం కడుపు నొప్పి అధికం కావడంతో పొలంలోకి వెళ్లి విషగుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బంధువులు సూర్యచంద్రున్ని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన భీమునిపాడు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శ్యాంబాబు (58) అనే వ్యక్తి ఆదివారం రాత్రి మోటారు బైకుపై కోవెలకుంట్ల నుంచి భీమునిపాడుకు వెళ్తుండగా అదుపు తప్పి బైకుపై నుంచి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య గ్రేసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాముకాటుతో బాలుడు..

ఆదోని రూరల్, జూలై 8 ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపెండేకల్లు గ్రామానికి చెందిన దుర్గప్రసాద్(16) పాముకాటుతో మృతి చెందాడు. వివరాల మేరకు.. రెండు రోజుల క్రితం ఇంట్లో నిద్రిస్తుండగా బాలుడిని పాము కాటేసింది. కుటుంబ సభ్యులు ఆదోని ఏరియాసుపత్రిలో చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. అయితే బాలుడు కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. తండ్రి చిన్న రంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి..

ఎమ్మిగనూరు రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గువ్వలదొడ్డి గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన మేరకు.. గువ్వలదొడ్డి గ్రామానికి చెందిన వృద్ధుడు మృతిచెందడంతో దహన సంస్కారాల్లో పాల్గొనేందుకు నందవరం మండలం కనకవీడు గ్రామానికి నరసింహులు (45) బైక్‌పై గువ్వలదొడ్డికి వెళ్తున్నాడు. గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో నరసింహులు కిందపడి గాయాలపాలయ్యాడు. సమాచారం మేరకు చేరుకున్న 108 సిబ్బంది కర్నూలు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఎమ్మిగనూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోలుకోలేక యువకుడు..

ఎమ్మిగనూరు మండలం సంత నాగులాపురం గ్రామానికి చెందిన ఏసేపు (24) కోలుకోలేక మంగళవారం మృతిచెందాడు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన మేరక.. వారం రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..

నందవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలదిన్నె గ్రామానికి చెందిన బీమన్న(22) బైక్ అదుపుతప్పి మంగళవారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన మేరకు.. బీమన్న గ్రామంలోని రాఘవేంద్ర సర్కిల్ వద్ద పెట్రోల్ పోయించుకుని ఇంటికి వస్తుండగా కల్లుపెంట వద్ద కుక్క అడ్డురావడంతో బైక్‌నుంచి ఎగిరి రోడ్డు పక్కనే ఉన్న రాయిపై పడ్డాడు. తల బలంగా కొట్టుకోవడంతో తీవ్రంగా రక్త స్రావమై మృతి చెందాడు. చుట్టుపక్కల వారు పరిగెత్తి వెళ్లేసరికే మృతి చెందాడు. మృతుడికి ఏడాదిన్నర క్రితం వివాహం కాగా, భార్య లింగేశ్వరి, మూడు నెలల కుతూరు వర్షిత ఉంది.



బీమన్న(ఫైల్)

గుర్రపు డెక్కలో చిక్కుకుని బర్రెలు మృతి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కుందూనదిలో గుర్రపు డెక్కలో చిక్కుకుని 11 బర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన పట్టణంలోని మూలసాగరం సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మూలసాగరం కాలనీకి చెందిన శ్రీనివాసరెడ్డి మంగళవారం బర్రెలు మేపేందుకు కుందూనదిలోకి వెళ్లాడు. నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో బర్రెలు గట్టు వైపు పరుగులు తీశాయి. ఈక్రమంలో ఒకవైపు ఉన్న గుర్రపు డెక్కలో చిక్కుకున్నాయి. స్థానికులు అగ్నిమాపకశాఖ కార్యాలయానికి ఫోన్ చేయడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఒక బర్రె, ఒక దూడను కాపాడారు. మిగిలిన 8బర్రెలు, మూడు దూడలు గుర్రెపు డెక్కలో చిక్కుకుని మృతిచెందాయి. పాడి పైన ఆధారపడి జీవిస్తున్న శ్రీనివాసరెడ్డికి చెందిన బర్రెలు ఒక్కసారిగా చనిపోవడంతో లబోదిబోమంటున్నాడు. తనను ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశాడు.




బర్రెల మృతికి కారణమైన గుర్రపు డెక్క

అప్పుల కోసం తిప్పలు

పంట రుణాల కోసం పరపతి సంఘాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

- ఖరీఫ్‌లో రూ.500 కోట్ల రుణాలు ఇవ్వాలని డీసీసీబీ లక్ష్యం
- 19 సంఘాలకు మాత్రమే రుణాలిచ్చే అర్హత
- 80 సంఘాలకు అర్హత లేదంటున్న అధికారులు
- రికవరీ కోసం సీఈవోలను పరుగులు పెట్టిస్తున్న అధికారులు





కల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం



ఈ రైతు పేరు మల్లన్న. పత్తికొండ నియోజకవర్గంలోని క్రిష్ణగిరి గ్రామం. ఈ ఖరీఫ్‌లో తనకున్న ఐదెకరాల పొలంలో వేరుశనగ పంటను సాగు చేసేందుకు పెట్టుబడికోసం చేయని ప్రయత్నం అంటూ లేదు. ప్రాథమిక వ్యవ సాయ పరపతి సంఘం చుట్టూ ప్రతిరోజూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. గతంలో ఈ క్రిష్ణగిరి సంఘంలో తీసుకున్న రుణాలు సక్రమంగా వసూలు కాలేదని సహకార బ్యాంకు తేల్చింది. బకాయిలను రికవరీ చేస్తేనే తిరిగి రుణాలు ఇచ్చేందుకు నిధులను కేటాయిస్తామని చెప్పింది. దీంతో సంఘం సీఈవో, సిబ్బంది బకాయిలు రాబట్టేందుకు గ్రామాల వెంట పరుగులు పెడుతున్నారు. బకాయిల రికవరీ ఎప్పుడు పూర్తవుతుంది? ఎప్పుడు తమకు రుణం మంజూరు చేస్తారు? అని ఈ రైతు ఎదురు చూస్తున్నాడు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మూడు లక్షల మంది రైతులు ఖరీఫ్ సాగు కోసం పడిగాపులు కాస్తున్నారు.

కర్నూలు అగ్రికల్చర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఈ సంవత్సరం రైతులకు పంట సాగు కోసం సహకార సంఘాల ద్వారా రూ.500 కోట్ల రుణాలు ఇవ్వాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారులు నిర్ణయించారు. గత సంవత్సరం రైతులకు ఇచ్చిన రుణ బకాయిలను సకాలంలో చెల్లించిన రైతులకే మొదట ప్రాధాన్యత జాబితాలో చేర్చి ఆ సంఘా లకు నిధులు కేటాయించాలని బ్యాంకు అధికారులు స్పష్టం చేస్తున్నారు. 60 శాతం రుణ బకాయిలు చెల్లించిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు మాత్రమే రుణాలు పంపిణీ చేసేందుకు నిధులను కేటాయించే అవకాశం ఉందని అధికా రులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటిదాకా ఉమ్మడి జిల్లాలోని 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో 19 సంఘాలు మాత్రమే రుణబకాయిలు సక్రమంగా చెల్లించిన అర్హత లభించింది. ఇంకా 80 సంఘాలు 60శాతం రుణ బకాయిలను సాధించలేక వెనుకబడి పోయాయి. ఈ సంఘాలకు నిధులు విడుదల చేయా లంటే లక్ష్యం మేరకు బకాయిలు వసూలు చేయాల్సిందేనని, వెంటనే గ్రామాలకు వెళ్లి రైతులకు అవగాహన కల్పించి బకాయిలు వసూలు చేయాలని అధికారులు ఆదేశించారు. దీంతో సహకార సంఘాల సీఈవోలు సిబ్బంది గ్రామాలకు పరుగులు తీస్తున్నారు. అయితే ఒత్తిడి తెచ్చినా రైతులు బకాయిలు చెల్లించేందుకు నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నా రని సంఘాల అధికారులు వాపోతున్నారు. కల్లూరు మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన ఒక రైతు రుణ బకాయిలను వెంటనే చెల్లించాలని ఒత్తిడి తెస్తే తన వల్ల కాదని, తనకే పంట సాగు కోసం రుణం ఇవ్వాలని అర్థించడంతో సహకార సంఘం అధికారులు మరో దారిలేక వెనుదిరిగి వచ్చారని సమాచారం.

19 సంఘాలకే రుణాలు ఇచ్చేందుకు అర్హత



వర్షాభావం, గిట్టుబాటు ధర అందని కారణంగా ఉమ్మడి జిల్లాలోని రైతులు చాలామంది రుణ బకాయిలు చెల్లించలేకపోతున్నారు. దీంతో రైతులకు రుణాలు ఇచ్చిన ప్రాథమిక వ్యవసాయ పరిపతి సంఘాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కేవలం 19 సంఘాలకు మాత్రమే రుణాలు ఇచ్చే అర్హత ఉన్నట్లు గుర్తించాం. మిగిలిన 80 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు త్వరిత గతిన రుణ బకాయిలు వసూలు చేయగలిగితే రైతులందరికీ పంట రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుంది. **- వెంకటకృష్ణ, డీసీవో**

రుణం ఇచ్చే సమయంలో రికవరీలా...! రైతుల ఆవేదన

ఉమ్మడి జిల్లాలోని 99 సహకార సంఘాల ద్వారా ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో నాలుగున్నర లక్షల మంది రైతులు సాగు రుణాలు తీసుకుంటున్నారు. ఇతర వాణిజ్య బ్యాంకులతో పోటీ పడి సహకార కేంద్ర బ్యాంకు రైతులకు రుణాలు అందిస్తుండటంతో రైతులంతా సహకార సంఘాల ద్వారానే రుణాలు తీసుకునేందుకు క్యూ కడుతున్నారు. మామూలుగా పంట కాలం ముగిసిన తర్వాత పంట ఉత్పత్తులను అమ్మిన సమయంలో సహకార సంఘాల అధికారులు, సిబ్బంది రైతుల నుంచి రుణ బకాయిలను వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అయితే ఈసారి పంట అమ్ముకున్న రైతులు వివిధ కారణాల వల్ల బకాయిలు చెల్లించలేక పోయారు. దీంతో రికవరీ 80 సంఘాలకు లేకుండా పోయింది. కేవలం 19 సహకార సంఘాలు మాత్రమే 60 శాతానికి మించి బకాయిలను రాబట్టగలిగాయి. సాగు కోసం ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీలు చెల్లించి అప్పులు తీసుకోవాల్సిన పరిస్థితి దాపురిస్తోందని, తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్న ప్రాథమిక వ్యవసాయ సంఘాల నుంచి ప్రస్తుతం రుణాలు అందుతాయో లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రికవరీ శాతాన్ని 60 నుంచి కొంత సడలింపు ఇస్తే చాలా సంఘాలకు రైతులకు రుణాలు ఇచ్చే అర్హత సాధించే అవకాశం ఉందని సీఈవోలు అంటున్నారు.

బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉండాలి

జాయింట్ కలెక్టర్ బి.నవ్య



బీఎల్‌వోలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జేసీ నవ్య

కల్లూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉండాలని పాణ్యం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ బి.నవ్య ఆదేశించారు. మంగళవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో కల్లూరు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కె.అంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన బీఎల్‌వోల శిక్షణ కార్యక్రమానికి జేసీ నవ్య హాజరై మాట్లాడారు. ఓటర్ల నమోదులో ఫారం-6,7,8 ఎప్పటికప్పుడు తీసుకుని క్షేత్రస్థాయిలో విచారించి అప్ డేట్ చేయాలన్నారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సరిపడా వసతులు, ఇబ్బందులను తమ దృష్టికి తీసుకురావాలని బీఎల్‌వోలకు ఆదేశించారు. 1,200 ఓటర్లు దాటిన పోలింగ్ స్టేషన్లు 60 ఉన్నాయని, అందులో 46 పోలింగ్ కేంద్రాలను పక్క స్టేషన్‌కు బదిలీ చేసే అవకాశం ఉండగా మిగిలిన 14 పోలింగ్ కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. కొత్తగా వచ్చిన బీఎల్‌వోలకు ఈనెల 8వ తేదీ నుంచి 12 తేదీ వరకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రోజుకు 50 మంది చొప్పున శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం 30మార్కులకు అసెస్మెంట్ పరీక్ష నిర్వహించి బీఎల్‌వోలకు సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని జేసీ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు విష్ణుప్రసాద్, ఎలక్షన్ డీటీ అనూరాధ ఎంపీడీవో జి.నాగ శేషాచలరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన కలెక్టర్



మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు రూరల్ జూలై 8(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం పి.రుద్రవరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం కలెక్టర్ పి.రంజిత్ బాషా పరిశీలించారు. ఈసందర్భంగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డితో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం గ్రామ శివా రులో జరుగుతున్న ఉపాధి పనుల గురించి కలెక్టర్ కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతంలో వసతు లు కల్పిస్తున్నారా లేదా అని కలెక్టర్ కూలీ లను అడిగి తెలుసుకు న్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతి గ్రామంలో రైతులు, కూలీలు బాగుండాలని అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. పాలన పారదర్శకంగా జరిగేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పేర్కొన్నారు. ఈకార్యక్ర మంలో జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల వద్ద పొగాకు ఉత్పత్తుల అమ్మకం నిషిద్ధం

- ఆపరేషన్ క్యాంపస్ సేఫ్ జోన్ స్పెషల్ డ్రైవ్



కర్నూలులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కర్నూలు క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థల వద్ద వంద గజాల దూరంలో సిగరెట్, పొగాకు సంబంధిత పదార్థాల విక్రయం నిషేధించినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. మంగళవారం పోలీసు అధికారులతో ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ క్యాంపస్ సేఫ్ జోన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. పోలీసు అధికారులు తమ పరిధిలోని విద్యాసంస్థలను సందర్శించి వంద గజాల్లోపు టీషాపులు, పాన్ షాపులు, కిరాణం అంగళ్లలో సిగరెట్లు, ఖైనీ గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులు అమ్మడం నిషేధమని షాపుల నిర్వాహకులకు తెలిపారు. విద్యాసంస్థల వద్ద పొగాకు ఉత్పత్తులను విక్రయించే యజమానులకు సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం (సీవోటీపీఏ) యాక్టు ప్రకారం జరిమానా విధించారు. యువత భవిష్యత్తును కాపాడేందుకు ఈ తరహా నిషేధిత పదార్థాల వినియోగాన్ని నిరోధించాల్సిన అవసరం ఉందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సీవోపీటీఏ చట్టం ప్రకారం షాపులను సీజ్ చేసి షాపు యజమానులపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం హామీ

- ఏపీ వీఆర్వో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మౌలిబాషా



మాట్లాడుతున్న మౌలిబాషా

కర్నూలు కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చిందని ఏపీ వీఆర్వో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మౌలిబాషా హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం అసోసియేషన్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్‌డబ్ల్యూఎస్ రేషనలైజేషన్‌లో వీఆర్వో గ్రేడ్-1 పోస్టులను తగ్గించవద్దని, అలాగే ప్రోటోకాల్ విధుల నుంచి రెవెన్యూ శాఖ సిబ్బందిని మినహాయిస్తే రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలగదని అన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ విషయంపై రెవెన్యూ మంత్రి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టులను అర్హులైన గ్రేడ్-1, గ్రామ రెవెన్యూ అధికారులతో భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సరాజు, శ్రీధర్, తిరుమల్‌రెడ్డి, బుద్ధకవి, నారాయణరెడ్డి, రాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు వైసీపీ, కాంగ్రెస్ నేతల నివాళి





వైఎస్సార్ విగ్రహానికి, చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నంద్యాల జిల్లా వైసీపీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు

కల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ, వైసీపీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి 29వ వార్డు షరీన్‌నగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సంగాల సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, శ్వేతారెడ్డి. నారాయణరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నంద్యాల డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు జె.లక్ష్మీ నరసింహాయాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కృపానందం వృద్ధాశ్రమంలో వైఎస్సార్ జయంతిని నిర్వహించారు. కేక్ కట్, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రజాక్‌వలి, పఠాన్ అభిఖాన్, అనంతరత్నం, సుంకన్న, మద్దిలేటి, జనార్ధన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన


ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. పాఠశాల విద్యా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పాఠశాల ఎదుట ఉన్న రోడ్డుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 13 మంది ఉపాధ్యాయులు పనిచేసే వారని, దీన్ని వలన మంచి బోధన అంది పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు వచ్చాయన్నారు. ఇటీవల జరిగిన బదిలీలో గతంలో పని చేసిన ఉపాధ్యాయులు అందరూ బదిలీ అయి, కొత్త వారు రావడంతో బోధన అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాయంత్రం బడి వేళలు అనంతరం జరిగే స్పెషల్ క్లాసులు జరగడంలేదని వివరించారు. కార్యక్రమములో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రసాద్, నర సింహులు, లక్ష్మీనారాయణ, మధుసూదన్, నరేష్, ప్రవీణ్ పాల్గొన్నారు. ఈవిషయంపై పాఠశాల హెచ్ఎం మాబువుసేని మాట్లాడుతూ పాఠశాలలో 9 ఉపాధ్యాయ పోస్టులకుగాను 8మంది పనిచేస్తున్నారని, ఖాళీగా ఉన్న గణితశాస్త్ర పోస్టు స్థానంలో సొంత నిధులతో ప్రైవేటు టీచర్‌ను నియమించామన్నారు. గతంలో పని చేసిన ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు లేనిపోనివి చెప్పి తమపై రెచ్చ కొట్టిస్తున్నట్లు వివరించారు. ఈ ఒత్తిళ్లను భరించలేక ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు చెప్పారు.

పండ్ల మొక్కల పెంపకంతో ప్రయోజనం

ఓర్వకల్లు, జూలై 8(ఆంధ్రజ్యోతి): పండ్ల మొక్కల పెంపకంతో రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గుడుంబాయి తండాలో ఉపాధి హామీ పథకం ద్వారా వంద శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేసిన పండ్ల మొక్కలను రైతుల పొలాల్లో నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని హుశేనాపురం, కాల్వ, ఉయ్యాలవాడ, లొద్దిపల్లె గ్రామాల చిన్న, సన్నకారు రైతులకు మామిడి, నిమ్మ, బత్తాయి, సీతాఫలం పండ్ల మొక్కలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీవో మద్దేశ్వరమ్మ, ఈసీ మధుశేఖర్, మాజీ ఎంపీపీ లక్ష్మణరావు, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్ నాయక్, వెంకటరమణ, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, మహబూబ్ బాషా, రైతులు పాల్గొన్నారు.

పండ్లతోటల సాగు లాభదాయకం


మొక్కకు నీరు పోస్తున్న ఎంపీడీవో

కోడుమూరు రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల సాగు లాభదాయకమని ఏపీడీ లక్ష్మన్న అన్నారు. మండలంలోని ముడు ములగుర్తిలో రైతు మధు పొలంలో చీనీ మొక్కలను నాటే కార్యక్రమంలో ఏపీడీ, ఎంపీడీవో రాముడు, ఏపీవో మోదీన్‌బాషా పాల్గొని మొక్కలు నాటారు. ఏపీడీ లక్ష్మన్న మాట్లాడుతూ పండ్ల మొక్కల పెంపకానికి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుంద న్నారు. ఏపీవో మోదీన్‌బాషా మాట్లాడుతూ గ్రామంలో సుమారు 12 ఎకరాల్లో పండ్ల తోటలు పెంచడా నికి 8 మంది రైతులు ముందుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో ఈసీ ఉస్మాన్, టీడీపీ మండల పట్టణ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, గంగాధర్ నాయుడు, టీఏ రజిత, ఎఫ్ఏ చిన్న మధు పాల్గొన్నారు.

పెద్దటేకూరులో వన మహోత్సవం

కల్లూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం పెద్దటేకూరులో ఎంపీడీవో నాగేశాచలరెడ్డి ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు 2025-26 ఆర్థిక ఏడాదికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో పండ్లతోటల పెంపకం కింద నాగరాజు అనే రైతుకు 450 మొక్కలు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ రమాదేవి, ఎంపీటీసీ మునిస్వామి పాల్గొన్నారు.

మొక్కల ప్రాముఖ్యతపై అవగాహన

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవి నగర్‌లోని నారాయణ పాఠశాలలో ప్రిన్సిపాల్ మహ్మద్ ఆల్తాఫ్ అధ్యక్షతన మొక్కల ప్రాముఖ్యతపై మంగళవారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. వనమహోత్సవానికి ఏజీఎం అన్వర్ బాషా ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీ ప్రారంభించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమి ఆధ్వర్యంలో నగరంలోని ఉర్దూ అకాడమి కార్యాలయంలో విద్యార్థులకు ఉర్దూ కాల్‌గ్రఫీ టెస్టు నిర్వహించారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, 8, 9, 10 తరగతుల విద్యార్థులు మొత్తం 82 మంది ఈ పరీక్షలో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు షేర్వా సూరి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు సూరి మన్సూర్ ఆలీఖాన్ నగదు బహుమతులు అందజేశారు. పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, మైనార్టీ సంక్షేమ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ నేతృత్వంలో ఈ టెస్టు ద్వారా విద్యార్థులను ప్రోత్సహించామని మన్సూర్ ఆలీఖాన్ తెలిపారు. అనంతరం డీఎం డబ్ల్యూవో సబియా పర్వీన్, విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్స్ మహ్మద్ పీర్ పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోండి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం

కర్నూలు అగ్రికల్చర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా వ్యవసాయ జేడీ కార్యాలయంలో ఒక చిరుద్యోగి ద్వారా రూ.95లక్షలు కుంభకోణానికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిధుల స్వాహాకు సంబంధించి అధికారులను కేసుల నుంచి తప్పించేందుకు కుట్రలు జరుగుతున్నాయని, ఈ వ్యవహారంలో కేవలం చిరుద్యోగి రాజేష్‌ను మాత్రమే దోషిగా తెరపైకి తీసుకువచ్చారన్నారు. జేడీఏ కార్యాలయంలో పని చేస్తున్న రాజేష్ అనే వ్యక్తి తన భార్య పేరుతో బోగస్ కంపెనీలను సృష్టించి ఆమె పేరుతోనే బ్యాంకు అకౌంట్‌ను కూడా తీసుకున్నారన్నారు. జాతీయ ఆహార భద్రతా మిషన్ పథకం నిధులు రూ.95 లక్షల దాకా గతంలో పని చేసిన వ్యవసాయ శాఖాధికారులు ఉన్నారని జగన్నాథం ఆరోపించారు.

ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమం

ఎమ్మెల్సీ బీటీ నాయుడు

కర్నూలు అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమంతో ప్రజలకు భరోసా కలిగిందని ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. మంగళవారం నగరంలోని బీక్యాంప్ లోని పలు కాలనీల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, జిలా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, సురేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● **24వ వార్డులో కుడా చైర్మన్..** అనంతపురం పట్టణంలోని 24వ వార్డులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. హౌసింగ్ బోర్డు శాసన సభ్యులు దగ్గుపాటి ప్రసాద్, పరిశీలకులు కొంకతి లక్ష్మీనారాయణలతో కలిసి ప్రజలకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ఎలా అమలు అవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమంతో సుపరిపాలన: ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు: అభివృద్ధి, సంక్షేమం కలగలిపిన సుపరిపాలన ఏడాది కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు అందించారని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సోమయాజుల పల్లె, గుడుంబాయి తండా గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఉపాధ్యక్షులు మోహ న్‌రెడ్డి, నాయకులు పాలకొలను సుధాకర్ రెడ్డి, వెంకటరమణ, ఆకుల మహేష్, కాకి దేవేంద్ర, శ్రీరామ శ్రీనివాసరెడ్డి, రామ మద్దిలేటి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, నాగేశ్వర రెడ్డి, నాగమల్లేష్, ప్రతాప్, సంజీవ, మహ బూబ్ బాషా, బోయ వెంకటరమణ, భైరీ హనుమంతరావు పాల్గొన్నారు.

కల్లూరు: రాష్ట్రంలో కూటమి పాలనపై అన్నివర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత పేర్కొన్నారు. సుపరిపాలన తొలిఅడుగులో భాగంగా ఆమె 35వ వార్డు అయ్యప్పనగర్ కాలనీలో పర్యటించి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గౌరుచరిత మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రం దివాళా తీసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి, సంక్షేమాని పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి పీయూ మాదన్న, ఎన్వీరామకృష్ణ, పాణ్యం ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు ఎస్.ఫిరోజ్, ఇన్‌చార్జి రవి ప్రకాష్‌రెడ్డి, హరికుమార్‌రెడ్డి, కోటేష్‌గౌడ్, టైలర్ నాగరాజు రాములమ్మ, సుంకన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆగస్టు 15 లోపు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం : తిక్కారెడ్డి

కర్నూలు రూరల్: రాష్ట్రంలో వచ్చే నెల 15వ తేదీలోపు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు సీఎం చంద్ర బాబు సన్నాహాలు చేస్తున్నారని కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. కర్నూలు మండలం పి.రుద్రవరం, పసుపుల గ్రామంలో మంగళవారం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి చేపట్టిన తొలి అడుగు కార్యక్రమానికి తిక్కారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందిస్తూ ప్రభుతం ఏడాదిలో చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను దశల వారిగా నెరవేరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గూడూరు: కూటమి ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు జె సురేష్ అన్నారు. మంగళవారం గూడూరు మండలం మల్లాపురం లో జె సురేష్ ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు - ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో భాగంగా స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అంది స్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగార్జున రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, సుల్తాన్, కాశీం, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: రాష్ట్రంలో సుపరిపాలన సీఎం చంద్రబాబు నాయుడుకే సాధ్యమని టీడీపీ మండల కన్వీనర్ ఎల్.రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ముడుములగుర్తిలో మంగళవారం ఇంటిం టికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గంగాధర్ నాయుడు, నాయకులు మధు, సాయి ఈశ్వరప్ప, మల్లేష్, గోపాల్, రవి పాల్గొన్నారు.


ప్రజలకు కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్సీ బీటీ నాయుడు


పసుపులలో కరపత్రాన్ని అందిస్తున్న తిక్కారెడ్డి, ఎమ్మెల్యే దస్తగిరి



సోమయాజులపల్లెలో కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి


రోడ్డుపై బైఠాయించిన మహిళలు

గూడూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మహిళలు రోడ్డుపై బైఠాయించారు. మంగళవారం గూడూరు పట్టణంలో సాయంత్రం 6 గంటల సమయంలో ఓ మోస్తరు వర్షం కురవడంతో నీరు డ్రైనేజీలో ముందుకు వెళ్లలేక నిలిచిపోవడం, ఆ నీరు ఎటూ వెళ్లలేక తెలుగు వీధి కాలనీలోని ఇళ్లలోకి చేరడంతో ఆగ్రహించిన మహిళలు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. టీడీపీ గూడూరు పట్టణ అధ్యక్షుడు కే. రామాంజనేయులు అక్కడకు చేరుకుని మహిళలతో మాట్లాడి సమస్యను కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ తెలుగు వీధిలో గత కొన్ని రోజులుగా డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయంపై నగర పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి: సీఐటీయూ

కర్నూలు హాస్పిటల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు ఆర్. నర సింహులు, ఉపాధ్యక్షుడు కె.సుధాకరప్ప డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ దేశ వ్యాప్తంగా సమ్మెలో భాగంగా మెడికల్ ఆఫీసర్లకు సమ్మె నోటీసును వారు అందజేశారు. కల్లూరు, శరీన్‌నగర్, ముజఫర్‌నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లను వారు కలిశారు. గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు మహేశ్వరి, రాఘవేంద్రమ్మ, లక్ష్మి, రేణుక, రజని, మద్దమ్మ పాల్గొన్నారు.

మహిళలపై విమర్శలు తగవు : ఎమ్మెల్యే

కల్లూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): మహిళలపై వైసీపీ నాయకుల విమర్శలు తగవు అని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోవూరు మహిళా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. మహిళల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన నీచమైన పదజాలాన్ని ఖండించడానికి కూడా జగన్‌రెడ్డి ముందుకు రాకపోవడం మహిళలను అవమానించడమే నని అన్నారు.

నేడు విద్యార్థులకు కౌన్సెలింగ్

సి.బెళగల్, 8(ఆంధ్రజ్యోతి): స్థానిక దిన్నెదేవరపాడులో ఐదో తరగతి విద్యార్థులకు 9:30 నుంచి మధ్యాహం వరకు, ఇంటర్ విద్యార్థులకు 2గంటల నుంచి 5 వరకు నేడు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు గురుకుల సమన్వయకర్త శ్రీదేవి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కౌన్సెలింగ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పత్తిలో చీడపీడలు నివారించండి: ఏవో

కోడుమూరు రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): పత్తిలో కనిపిస్తున్న చీడపీడల నివారణకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి రవి ప్రకాష్ తెలిపారు. మంగళవారం మండలంలోని వర్కూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పత్తి పంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిలో చీడపీడలను గమనించామని, దీని నివారణకు వేప కాషాయం లేదా వేప నూనెతో ఆసిఫేట్ కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు.

రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

అధికారులపై జడ్పీటీసీ, లద్దగిరి సర్పంచు ఆగ్రహం


అధికారులను నిలదీస్తున్న సర్పంచు పట్టె హనుమంతు

కోడుమూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. సర్పంచు పట్టె హనుమంతు మాట్లాడుతూ లద్దగిరి గ్రామం కోడుమూరు మండల ముఖ చిత్రంలో ఉందా? లేదా? అని అధికారులను నిలదీశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై ఎంపీడీవో రాముడు, ఏపీవో మోదీన్‌బాషాకు లద్దగిరి సర్పంచు పట్టె హనుమంతు మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. పంచాయతీ పాలక వర్గానికి సంబంధం లేకుండా అన్ని పనులు అధికారులే చేసుకొంటూ పోతే గ్రామంలో సర్పంచు, వార్డు మెంబర్లు ఎందుకు ఉన్నట్లు అని సర్పంచు ప్రశ్నించారు. పంచాయతీ తీర్మాణాలు లేకుండా పనులు ఎలా చేపడుతారని, గ్రామ సభ తీర్మాణం లేకుండా కొత్త వాళ్లకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఎలా అవకాశం ఇస్తారని, దుబాయిలో ఉన్న వాళ్లకు ఉపాధి పనులకు బిల్లులు ఎలా వేస్తారని ప్రశ్నించారు. దీంతో మండల సమావేశం కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇందుకు ఎంపీడీవో రాముడు సర్పంచును శాంతింపజేశారు. ఉపాధి పనులను భ్రష్టు పట్టించారు.. లద్దగిరి సర్పంచు పట్టె హనుమంతు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో మోదీన్‌బాషాల మధ్య మాటల యుద్ధం జరుగుతున్న సమయంలో జడ్పీటీసీ రఘునాథ్ రెడ్డి కలుగజేసుకొని ఉపాధి పనులను అధికారులు భ్రష్టు పటించారని అన్నారు. ఇందుకు ఏపీవో మోదీన్‌బాషా అయితే ఓకే అంటూ ప్రజాప్రతినిధులను అవమానించే విధంగా మాట్లాడారు. సమావేశంలోని కొంత మంది సభ్యులు మోదీన్ బాషా వ్యవహరిస్తున్న పద్ధతిని వ్యతిరేకించారు. దీంతో ఏపీవో తన అన్న మాటను వెనక్కి తీసుకొంటున్నానని చెప్పడంతో ప్రజాప్రతినిధులు శాంతించారు. కార్యక్రమంలో ఎంపీపీ రూతమ్మ, ఇన్‌చార్జి తహసీల్దార్ నాగరాజు, మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్, మండల ఇంజనీర్ గంగ రాజు మండల ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచు శ్రీనివాసరెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

షిరిడీ సాయి దేవస్థానంలో 10న గురుపౌర్ణమి


మాట్లాడుతున్న మురళీ మనోహర్

కర్నూలు కల్చరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని షిరిడీ సాయిబాబా దేవస్థానంలో ఈనెల 10 గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ట్రస్టు సభ్యుడు, సీనియర్ న్యాయ వాది బి.మురళీ మనోహర్ తెలిపారు. మంగళవారం దేవస్థానంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయనతో పాటూ మరో సభ్యుడు ఆర్ రామ్మోహన్, దేవస్థానం కోశాధికారి ఎస్‌జీ మహబలేష్ పాల్గొన్నారు. మురళీ మనోహర్ మాట్లాడుతూ గురుపౌర్ణమి సప్తాహ దీక్షా కార్యక్రమం ఈనెల 3న ప్రారంభించామని, అఖండ సాయి నామ స్మరణతో ఈనెల 10 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. దేవస్థానం కోశాధికారి ఎస్‌జీ మహబలేష్ మాట్లాడుతూ గురుపౌర్ణమి సందర్భంగా ఈనెల 10న ఉదయం 7.30 గంటలకు విష్ణు సహస్ర నామావళి పారాయణం, 8 గంటలకు మహాభిషేకం, 9.30 గంటలకు ధునిపూజ, 10 గంటలకు ప్రసాద వినియోగం, ఉదయం 10.30 నుంచి అన్నదాన కార్యక్రమం, 11 గంటలకు సత్యసాయి వ్రతం, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, సాయంత్రం 6 గంటలకు దేవస్థానం సమీపంలోని తుంగభద్ర నది వద్ద 'తుంగా హారతి', సాయంత్రం 6.30 గంటలకు ధూప్ హారతి, 7 గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమం, 8 గంటలకు పల్లకీసేవ, మహా రథోత్సవం, రాత్రి 9.30 గంటలకు శేజ్ హారతి ఉంటాయని వివరించారు.

రక్తహీనతపై అవగాహన కల్పించండి

కర్నూలు హాస్పిటల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): రక్తహీనతపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో పి.శాంతికళ ఆదేశించారు. నగరంలోని స్టాంటన్‌పురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆశా సమీక్ష సమావేశంలో డీఎంహెచ్‌వో పాల్గొన్నారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత ఆరోగ్య సేవల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంవో డా.ఉమా, డీపీవో విజయరాజు, బయాలజిస్టు వెంకటేశ్వర్లు, మెడికల్ ఆఫీసర్ డా.మౌనిక, ఏఎస్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

కర్నూలు అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో కోడుమూరు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు బజారన్న, సుబ్రహ్మణ్యం శెట్టి, లాజరస్, సుంకన్న, షేక్ మాలిక్, సత్యరాజు, పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లులో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్ విగ్రహానికి పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్నూలు మాజీ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు రంగనాథగౌడు, ఎంపీపీ తిప్పన్న, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వెంగన్న, నాగ తిరుపాలు, హరినాథ్‌రెడ్డి, శివకృష్ణారెడ్డి, అల్లాస్వామి పాల్గొన్నారు.


వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఫుట్‌బాల్ పోటీలకు రిడ్జ్ జట్టు


క్రీడాకారులతో సీఈవో గోపీనాథ్

కర్నూలు స్పోర్ట్స్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న నంద్యాలలో నిర్వహించే తుంగభద్ర జోనల్ ఫుట్‌బాల్ పోటీలకు లక్ష్మీపురంలోని రిడ్జ్ పాఠశాల క్రీడాకారులు ఎంపికైనట్లు డీన్ రాజేంద్ర కుమార్ తెలిపారు. ఎండీ అఫాన్, జ్యోతి స్వరూప్, తరుణ్, శ్రీనివాస్‌లు జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారని తెలిపారు. పాఠశాల సీఈవో గోపీనాథ్ మాట్లాడుతూ ఫుట్‌బాల్ పోటీల్లో రాణించి విజేతలుగా నిలవాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మ్యాథ్యూ క్రీడాకా రులను అభినందించారు. కోచ్ బ్రహ్మకుమార్ సేవలను సీఈవో కొనియాడారు.

వేడి నీటిని తాగాలి

సి.బెళగల్, 8(ఆంధ్రజ్యోతి): నీటిని వేడి చేసుకుని తాగాలని సి.బెళగల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి మిథున్ కుమార్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆయన మాట్లాడుతూ తిమ్మన దొడ్డి, చింతమానుపల్లె, సంగాల, గుండ్రేవుల, ముడుమాల, కొండాపురం, ఈర్లదిన్నె, కొత్తకోట గ్రామాల్లోని ప్రజలు నది నుంచి వచ్చే కలుషిత నీరు తాగడం వల్ల అనారోగ్యాని గురవుతారని, తాగునీటిని వేడి చేసకుని తాగాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

లాడ్జిల్లో పోలీసుల తనిఖీ


లాడ్జిలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కర్నూలు క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం, మంగళవారం రాత్రి నగరంలో పలు లాడ్జిల్లో పోలీసులు తనిఖీలు చేశారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని లాడ్జిల యజమానులకు సూచించారు. అనుమానం ఉన్న వ్యక్తులను వారి వివరాలను ఆరా తీశారు. అలాగే లాడ్జిల్లో రాత్రి బస చేసే వ్యక్తుల గుర్తింపు కార్డులు తీసుకుని వివరాలు నమోదు చేయాలన్నారు. పరిసరాలు స్పష్టంగా కనిపించేలా తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్‌తో రాత్రి వేళల్లో ఎటువంటి నేరాలు జరగకుండా రాత్రి గస్తీని పటిష్టం చేశారు. అలాగే అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల వేలిముద్రలను సేకరించారు.

పీటీఎంను పండుగలా నిర్వహించాలి

ఆదోని అగ్రికల్చర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల పదో తేదీన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని పండుగలా నిర్వహించాలని ఎంఈవోలు భూపాల్ రెడ్డి, శ్రీనివాసులు సూచించారు. మంగళవారం ఎమ్మార్సీ భవనంలో మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో సమాజం భాగస్వామ్యం కావాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహిస్తుందన్నారు.
ఆలూరు: రేపు పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను నిర్వహించాలని ఎంఈవో కోమలాదేవి సూచించారు. పూర్వ విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను, అధికారులను ఆహ్వానించాలన్నారు.

సబ్సిడీ కంది విత్తనాల పంపిణీ



కందులను పంపిణీ చేస్తున్న ఏవో ఉషారాణి

దేవనకొండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో సబ్సిడీ కంది విత్తనాలను ఏవో ఉషారాణి పంపిణీ చేశారు. ఏవో మాట్లాడుతూ ఎల్ఆర్‌జీ 52 రకం కంది విత్తనాలు మండలానికి 39 క్వింటాళ్లు, 978 ప్యాకెట్లు, ఎల్ఆర్‌జీ 105 రకం 32 కేజీలు, 8 ప్యాకెట్లు వచ్చాయన్నారు. ప్యాకెట్ నాలుగు కేజీలు ఉంటుందని, రైతుసేవా కేంద్రాల్లో మోట్రిక్ వేసి తీసుకోవాలసి సూచించారు. ఏఈవో రంగన్న, అబ్దుల్‌సలాం, మల్లికార్జున, వీఏఏ కళావతి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



కలెక్టర్‌తో వైకుంఠం

ఆలూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ రంజిత్ బాషాను టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్‌ను కలిసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, అలాగే నిలిచిపోయిన హొళగుంద-హెబ్బటం రహదారిని పూర్తి చేయాని కోరామన్నారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

పెద్దబావిలో శ్రమదానం

ఆస్పరి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పెద్దబావిలో మంగళవారం యువకులు శ్రమదానం చేశారు. తెలుగు యువత నాయకుడు యాగంటి రాఘవేంద్ర, అంపయ్య ఆధ్వర్యంలో బావిలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. చెత్తను తొలగిస్తే బావి వర్షపునీటితో నిండుతుందన్నారు. నవీన్, రాముడు, ఉదయ్, ఉమేష్, చక్రవర్తి, తేజ, రామంజిని పాల్గొన్నారు.



చెత్తాచెదారాన్ని ఏరి వేస్తున్న యువకులు

టీబీ ప్రాణాంతకం కాదు

మద్దికెర, జూలై 8 (ఆంధ్రజ్యోతి): టీబీ ప్రాణాంతకం కాదని, తొలి దశలోనే గుర్తిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని ప్రభుత్వ వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం ఎం.అగ్రహారం, మద్దికెర గ్రామాల్లో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా అవగాహన కల్పించారు. 26 మందికి గళ్ల, ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. అక్బర్‌బాషా, కృష్ణమ్మ, లక్ష్మి, ఈరన్న, మమత ఉన్నారు.

మొహర్రం నిర్వహణపై ఎస్ఐకి సన్మానం



ఎస్ఐ దిలీప్ కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

హొళగుంద, జూలై 8 (ఆంధ్రజ్యోతి): హొళగుంద మండలం కొగిలాతోట గ్రామంలో మొహర్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు వ్యవహరించిన తీరుపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఎస్ఐ గురజాల దిలీప్ కుమార్, పోలీసు సిబ్బందిని పోలీస్ స్టేషన్‌లో కొగిలాతోట గ్రామస్థులు శాలువ కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు, ఆలూరు సీఐ రవిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఆ గ్రామాల్లో అల్లర్లు జరగకుండా ప్రజల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మొహర్రం ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవడంలో పోలీసులు సఫలీకృతం అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొగిలాతోట గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వానొస్తే ఇంతే..



తెర్నేకల్ రామమ్మపేట కాలనీ రహదారిపై వర్షపునీరు



హొళగుందలోని వాల్మీకి సర్కిల్ వద్ద బురదమయంగా రోడ్డు

దేవనకొండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెర్నేకల్లు గ్రామంలో రామమ్మపేట కాలనీలో వర్షపునీరు రోడ్డుపై నిలిచి మడుగులా మారింది. పాదచారులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.
హొళగుంద: మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి వాల్మీకి సర్కిల్ వరకు మట్టిరోడ్డు బురదమయంగా మారింది. గుంతల్లో వర్షపు నీరు నిలిచి బురదతో వాహరదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై పంచాయితీ కార్యదర్శి రాజశేఖర్ ను వివరణ కోరగా గ్రావెల్ వేసి రోడ్డుకు మరమ్మత్తులు చెపడతామని తెలిపారు.

స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలను సాధిద్దాం

- ఎమ్మెల్యే పార్థసారథి
- ఆదోని నియోజవకర్గ అభివృద్ధి, పీ-4 పాలసీపై అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలను సాధిద్దామని ఎమ్మెల్యే పార్థసారథి పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి మున్సిపల్ సమావేశ భవనంలో నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గ స్పెషల్ అధికారి, సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అధ్యక్షత వహించగా, నియోజకవర్గ చైర్మన్‌గా ఎమ్మెల్యే పాల్గొన్నారు. పీ4 పాలసీ అమలు, ప్రాధాన్య ప్రాజెక్టుల పురోగతి, వనరుల వినియోగం, ప్రజలకు అందుతున్న సదుపా యాలపై అధికారులు నివేదికలను సమర్పించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ అక్ష్యసాధనకు అధికారులు కృషి చేయాలని సమష్టిగా పనిచేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, కమిషనర్ కృష్ణ, మెప్మా పీడీ లీలావతి, ఎంపీడీవో జనార్ధన్, అధికారులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

ఖరీఫ్ సీజన్లో యూరియా కొరత లేకుండా చూడాలని, వ్యవసాయ అధికారులను సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. మంగళవారం కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతులు యూరియాను రైతుసేవా కేంద్రాలల్లో పొందేలా చర్యలు తీసుకోవాల న్నారు. అధిక ధరలకు విక్రయించే దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు సమాచారాన్ని రైతుసేవా కేంద్రం ద్వారా తెలియజేయాలని ఆదేశించారు.

వచ్చే నెలలో స్మార్ట్ రేషన్ కార్డులు



ప్రకాష్‌నగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఆదోని, జూలై 8(ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేయనుందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షి నాయుడు అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రకాష్ నగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించి, ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. పాత కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్‌తో కార్డులు వస్తాయని, నాయకుల ఫొటోలు ఉండవన్నారు. గత పాలకులు రైతులకు విత్తనాలు సకాలంలో ఇవ్వలేదని, నాడు-నేడు పేరుతో డబ్బులు దోచుకున్నారని ఆరోపించారు. త్వరలో నియోజకవర్గంలో నూతన పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రామస్వామి, రామచంద్ర, ఉమ్మి సలీం, బుద్ధారెడ్డి, అప్సర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వంలో గిరిజనుల అభివృద్ధి



కరపత్రాలు ఇస్తున్న టీడీపీ సీనియర్ నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకట్రాముడు

తుగ్గలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంలో గిరిజనులు అభివృద్ధి చెందుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు అన్నారు. మంగళవారం వైబీ తండా, రోళ్లపాడు తండాల్లో సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని, సమస్యలను తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్లు రద్దు చేశారని, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రుణాలు ఇచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమపథకాలు ఇస్తున్నారని, ఎమ్మెల్యే శ్యాంబాబు తండాలపై దృష్టి పెట్టారన్నారు. తిరుపాల్ నాయుడు, వెంకటస్వామి, కొమ్మె వెంకటేష్, శ్రీనివాసులు గౌడ్, మిద్దె వెంకటేశ్ యాదవ్, రాజు నాయక్, తులసినాయక్, శ్రీనివా సులు నాయక్, జీటే నాయక్, నాయుడు నాయక్, గోవిందు నాయక్ ఉన్నారు.

బీఎల్‌వోలకు ఆరు రోజుల శిక్షణ



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బూత్‌లెవెల్ ఆఫీసర్లకు ఆరు రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పేర్కొన్నారు. మంగళవారం కార్యాలయంలో ఈసీ ఆధ్వర్యంలో ఆదోని నియోజకవరగంలోని బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ 8, 9, 11, 14, 15, 16 తేదీల్లో ఉంటుందన్నారు. ఓటర్ల నమోదు, పోలింగ్ కేద్రంలో అవలంబించాల్సిన నిబంధనలు, వివరించారు. నూతన ఓటర్ల నమోదు ఫారం-6, చిరునామా, పేరులో సవరణలు ఫారం-8, డెత్‌డిలేషన్ ఫారం-7 ప్రక్రియ క్షేత్రస్థాయిలో చేయాలన్నారు. ట్రైనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రమేష్, ఎన్నికల డీటీ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వర్తింపజేయండి

ఆదోని రూరల్, జూలై 8 ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను తమకు వర్తింపజేయాలని అంగన్‌వాడీ వర్కర్లు ఎమ్మెల్యే పార్థసరాథిని కోరారు. మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లు వరలక్ష్మి, వెంకటలక్ష్మి మాట్లాడుతూ తమ బాధ వింటే మీకు నవ్వొస్తుందో సార్ అంటూ నిలదీశారు. స్పందించిన ఎమ్మెల్యే మీ సమస్యలను అసెంబ్లీలో చర్చిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్యాస్ స్టౌలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఉమామహేశ్వరి, రాజశేఖర్ పాల్గొన్నారు. అంగన్‌వాడీ పుస్తకాలపై జగన్ ఫొటోను చూసిన ఎమ్మెల్యే పార్థసారథి, ప్రభుత్వం మారినా ఇంకా జగన్ ఫొటో ఉన్న పుస్తకాలనే పంపిణీ చేస్తున్నారా? అని ప్రశ్నించారు.

నేడు వైద్య శిబిరం

మద్దికెర, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎడవలి గ్రామంలో బుధవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి హుశేన్‌సాహెబ్, ఆపద్బాంధవ సేవా సమితి అధ్యక్షుడు చొక్కా సునీల్ కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు గ్రామ సచివాలయం వద్ద వైద్య పరీక్షలు చేస్తామన్నారు. జీర్ణ, శ్వాసకోశ, చర్మ వ్యాధులకు పరీక్షలు చేస్తామన్నారు.

సొసైటీ అధ్యక్షుల ఎంపిక



వేణుగోపాల్, ప్రభాకర్ రెడ్డి

తుగ్గలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పర్లపల్లి, ఎద్దులదొడ్డి సహకార సొసైటీలకు అధ్యక్షులను ప్రభుత్వం ఎంపికచేసినట్లు సీఈవోలు గిడ్డయ్య, మనోహర్‌నాయుడు తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ ఉప్పర్లపల్లి సొసైటీ అధ్యక్షుడిగా అప్పా వేణుగోపాల్, డైరెక్టర్లుగా భీమలింగప్ప చౌదరి, చిన్న పెద్దయ్య ఎన్నికయ్యారు. అలాగే మారెళ్ల సొసైటీ అధ్యక్షుడిగా ఎద్దుల దొడ్డి ప్రభాకర్ రెడ్డి, డైరెక్టర్లుగా రాంపల్లె శ్రీనివాసులు, బొందిమడుగుల మోహన్ ఎంపికయ్యారు.

పండ్ల మొక్కల సాగుతో దిగుబడి



మొక్కలు అందజేస్తున్న ఎంపీడీవో

దేవనకొండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పండ్ల మొక్కలు సాగు చేస్తే అధిక దిగుబడి సాధ్యమని ఎంపీడీవో జ్యోతి తెలిపారు. మంగళవారం కొత్తపేట గ్రామంలో ఉపాధి హామీపథకం కింద పండ్ల మొక్కలను పంపీణి చేశారు. ప్రభుత్వం వందశాతం రాయితీతో తోటల పెంపకాన్ని పోత్సహిస్తుందని, పంట సంరక్షణకు మూడేళ్ల పాటు ఉపాధి ఇస్తుందన్నారు. ఏపీవో రాజునాయక్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రత్నం, ఈసీ గంగన్న, తదితరులు ఉన్నారు.

గోవులను తరలిస్తాం

- మున్సిపల్ కమిషనర్ కృష్ణ



ఆదోని టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీధుల్లో సంచరించే గోవులను ఆలూరు రోడ్డులోని పంజరాపోల్ గోశాలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ వీటితో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడమే కాకుండా, వాహనాల రాకపోకలకు అడ్డు వస్తున్నాయన్నారు. యజమానులు వాటిని తమ ఇళ్ల వద్దనే పెంచుకోవాలని సూచించారు. బహిరంగంగా తిరిగేవాటిని ఈనెల 10వ తేదీన పోలీసుల సహకారంతో గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు.

విద్యాసంస్థల వద్ద గుట్కాలు, సిగరెట్లు అమ్మరాదు

- డీఎస్పీ హేమలత



గుట్కా, సిగరెట్లు సీజ్ చేస్తున్న పోలీసులు

ఆదోని, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలల వద్ద గుట్కాలు, సిగరెట్లు అమ్మరాదని డీఎస్పీ హేమలత హెచ్చరించారు. 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్'లో భాగంగా మంగళవారం పోలీసులు పట్టణంలోని పాఠశాల, కళాశాల సమీపంలో గుట్కా లు, సిగరెట్లు అమ్ముతున్న దుకాణాలపై దాడులు చేసి, సరుకును సీజ్ చేశారు. యజమానులకు జరిమానాలు విధించారు. డీఎస్పీ మాట్లాడుతూ కళాశాల, పాఠశాలకు కనీసం వంద మీటర్ల దూరం వరకు వీటిని వక్రయించ కూడదని, బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్లు తాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు పలు షాపుల్లో దాడులు నిర్వహించామని, బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్లు తాగుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు.

మోసపు వాగ్దానాలతో గద్దెనెక్కిన చంద్రబాబు

- వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు
- వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

పత్తికొండ టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు మోసపు వాగ్దానాలతో గద్దెనెక్కారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం గోపాల్ ప్లాజాలో పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించారు. 40 ఏళ్ల అనుభవం ఉందని చెప్పుకుంటున్న చంద్రబాబు ఏ ఎన్నికల్లో అయినా ఒంటరిగా పోటీచేసి అధికారంలోకి వచ్చారా? అని ప్రశ్నించారు. సాధ్యంకాని హామీలు, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక ప్రజలను మభ్యపెడుతన్నారని, ఖజానా ఖాళీ అయిందనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్ 90శాతం సంక్షేమ పథకాలు ఇచ్చారన్నారు. రెడ్‌బుక్ పాలనతో మంత్రి లోకేష్ అమలు వైసీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, 2029లో తాము అధికారంలోకి వస్తే టీడీపీ నాయకుల భరతం పడతామని హెచ్చరించారు. పత్తికొండ ఇన్‌చార్జి శ్రీదేవి మాట్లాడుతూ అధికారం కోల్పోయినా పార్టీశ్రేణులు ధైర్యంతో పనిచేయడం హర్షణీయమన్నారు. ఎమ్మెల్సీ మధుసూదన్, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, ప్రదీప్‌రెడ్డి, శశికళ, శ్రీరంగడు, ఎ.నాగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి



పత్తికొండలో కేకు కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

పత్తికొండటౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి నిర్వహించారు. పోస్టాఫీసు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ నివాళి అర్పించి, కేక్ కట్ చేశారు. నాయకులు శ్రీరంగడు, నారాయణదాసు, సోమశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.
ఆలూరు: దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఎమ్మెల్యే విరుపాక్షి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రామాంజ నేయులు, వెంకటేష్, బాస్కర్, కొట్టాల రాజు, వరుణ్, మల్లికార్జున పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆదోని, జూలై 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలానికి వెళ్లి వస్తూ మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు టీటీడీ బోర్డు సభ్యుడు, వైద్యం శాంతారావు ఆర్థిక సాయం అందజే శారు. ప్రమాదంలో ఒకేసారి నాలుగు కుటుంబాలకు చెందిన వారు మరణించడం బాధాకరమన్నారు. డైరెక్టర్లు విజయకుమార్, మురళి నాయుడు, చిన్నారంగస్వామి, ఉన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న టీటీడీ బోర్డ్ మెంబర్

చెత్తను పారవేయొద్దు

వెల్దుర్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రజలు చెత్తను పారిశుధ్య సిబ్బందికి ఇవ్వాలని, ఎక్కడపడితే అక్కడ వేయొద్దని పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనాథ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని వార్డుల్లో పారిశుధ్య పనులను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మికంపోస్టు తయారు చేసి, రైతులకు విక్రయించి పంచాయతీకి ఆదాయం సమకూరుస్తామన్నారు. వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఉద్యోగులను రిలీవ్ చేయని ఎంపీడీవో

- సచివాలయ ఉద్యోగుల అవస్థలు



ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉద్యోగులు

దేవనకొండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ఎంపీడీవో బ్రేక్ వేశారు. ఈ నెల 9వ తేదీన శిక్షణ ఉంటుందని, అంతవరకు బదిలీ చేసేది లేదని ఉద్యోగులకు తెగేసి చెప్పినట్లు సమాచారం. అయితే మూడు రోజుల క్రితమే తమకు బదిలీ ఉత్తర్వులు అందాయంటున్నా ఎంపీడీవో పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు కేటాయించిన స్థానాల్లో చేరకపోతే సీనియార్టీ పోతుందని వాపోతున్నారు. రెండు రోజుల నుంచి ఎంపీడీవో చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ప్రయెజం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పదో తేదీ వరకు బదిలీ చేయను

ఈ నెల 9వ తేదీన శిక్షణ ఉండటంతో 10వ తేదీ వరకు సచివాలయ ఉద్యోగులను బదిలీ చేయడం కుదరదు. మండలానికి ఒక ఉద్యోగి రావడంతో ఆ స్థానంలో ఉన్న వారిని మాత్రమే రిలీవ్ చేశాను. పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇన్‌డెక్స్ శిక్షణ ఉంది అలాగే కొందరు సిబ్బంది పించన్ డబ్బులు వెనక్కు ఇవ్వకపోవడంతో రిలీవ్ చేయలేదు. - జ్యోతి, ఎంపీడీవో.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మధుసూదన్ రెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి, సమయాన్ని వృథా చేసుకోకుండా కళాశాలకు సక్రమంగా వచ్చి చదువుకొని ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఎస్సై మధుసూదన్ రెడ్డి ఆకాంక్షించారు. పొగ తాగడం, మద్యం, గంజాయి సేవించడం వల్ల ఉజ్వల భవిష్యత్తును కోల్పోతారన్నారు. వాటికి దూరంగా ఉంటూ బాగా చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని అన్నారు. విద్యార్థులు ఎవరైనా మద్యానికి గంజాయికి అలవాటుపడి, అనుమానస్పదంగా ఎవరైనా కన్పిస్తే సమాచారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ లింగన్న, మద్దిలేటి పాల్గొన్నారు

పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు తప్పవు

కోసిగి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కోసిగితో పాటు అన్ని గ్రామాల్లోని పాఠశాలలు, కాలేజీల పరిసర ప్రాంతాల్లో, షాపులలో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై హనుమంతరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ ఆదేశాలతో కోసిగి ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల సమీపంలోని పలు షాపుల్లో ఆపరేషన్ క్యాంపస్ ఫ్రీజోన్‌లో భాగంగా పొగాకు ఉత్పత్తులపై తనిఖీలు చేశారు. కోసిగిలోని 3 షాపులలో పొగాకు ఉత్పత్తులు ఉండటంతో వాటిని గుర్తించి ముగ్గురుపై కేసులు నమోదు చేసి ఒక్కొక్క షాపు యజమానిపై రూ.200లు జరిమానా విధించినట్లు ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నాగరాజు, బాలుర పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పేరెంట్స్ మీటింగ్‌కు రాఘువేంద్రరెడ్డికి ఆహ్వానం



రాఘువేంద్రరెడ్డికి ఆహ్వానపత్రికను అందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు పరిమళాదేవి

కోసిగి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలలో పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌కు మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోసిగి జిల్లా పరిషత్ బాలికలు, బాలురు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జి.పరిమళాదేవి మంగళవారం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి స్వగృహానికి వెళ్లి ఆహ్వానపత్రికను అందజేశారు. తమ ఆహ్వానాన్ని మన్నించి కార్యక్రమానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ మీటింగ్‌కు హాజరు కావాలని కోరారు.

ఓటరు నమోదుపై నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ

మంత్రాలయం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో త్వరలో చేపట్టే ఓటర్ల నమోదు ప్రక్రియ నమోదు, తొలగింపులు, సవరణలు, మార్పులు చేర్పులలో నిర్లక్ష్యం వహించవద్దని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ తెలిపారు. మంగళవారం మంత్రాలయం తహసీల్దార్ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల నేతలు, అధికారులతో నియోజకవర్గ తహసీల్దార్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశానికి బీఎల్‌వోలు తప్పక హాజరు కావాలని కోరారు. ఇప్పటి వరకు 237 పోలింగ్ కేంద్రాల ఉండగా.. 1200 ఓటర్లు దాటిన కేంద్రాల్లో అదనంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. కౌతాళం మండలం హాల్విలో పోలింగ్ బూత్‌పై రాజకీయ పార్టీల నాయకులు అభ్యంతరం తెలపడంతో దానిని పరిశీలిస్తామని తెలిపారు. సమావేశంలో మంత్రాలయం, కోసిగి తహసీల్దార్లు రమాదేవి, వేణుగోపాల్, ఎన్నికల డీటీలు జీకే గురురాజరావు, జర్మియా, తిక్కస్వామి, ఆర్ఐ జనార్దన్‌రావు, వీఆర్వోలు భీమయ్య, భీమన్నగౌడు, ఆనంద్, శ్వేత, పుష్పలత, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి.. అపరిశుభ్రం..

- పడక వేసిన పారిశుధ్యం
- అసహనం వ్యక్తం చేస్తున్న రోగులు
- పట్టించుకోని వైద్యాధికారులు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. పరిశుభ్రంగా ఉండాల్సిన ఆసుపత్రి ఆవరణ కాస్త ఎక్కడ పడితే అక్కడ చెత్త పేరుకొని అపరిశుభ్రంగా ఉంది. ఎక్కడ చూసినా ముళ్లపొదలతో నిండి పోయింది, దీనికి తోడు వైద్యం కోసం వచ్చిన వారు, బయట ప్రజలు ఆసుపత్రి పరిసరాలల్లో ఎక్కడ పడితే అక్కడ మల, మూత్ర విసర్జన చేస్తూ మరింత అపరిశుభ్రతకు కారణం అవుతున్నారు. ఆసుపత్రిలోని ప్రహరీ పక్కన, ఆ పక్కనే ఉన్న క్వార్టర్స్‌ను కూడా చెత్త కుండిగా మార్చేశారు. పురుషుల వార్డులోని బాత్‌రూములు అపరిశుభ్రంగా ఉంటూ దుర్గంధం వెదజల్లుతుండడం వల్ల రోగులు అసహనానికి లోనవుతున్నారు. బాత్‌రూములు శుభ్రం చేయక రోజులు గడుస్తున్నట్లు తెలుస్తుంది. ఆసుపత్రి ఆవరణంలో డ్రైనేజీలు సరిగా లేక ఎమర్జెన్సీ వార్డు ఓపీ పక్కనే మురుగు నీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతూ, దోమలకు నిలయంగా మారింది. ఆసుపత్రిలో ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేయడం వల్ల వైద్యం కోసం వచ్చిన వారు అసౌకర్యానికి గురవుతున్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల ఆసుపత్రి చూట్టు ప్లాస్టిక్, చెత్త ఎక్కడ పడితే అక్కడ పేరుకుపోయింది. త్రాగునీరు పట్టుకునే చోట మిగిలిన అన్నం అక్కడ పడేయడం వలన రోగులకు ఇబ్బందికరంగా మారింది. దీనికి తోడు ఆసుపత్రి అవరణలో కుక్కల బెడద కూడా ఎక్కువగా ఉంది. రోగులను పలకరించడానికి వచ్చిన వారు వాహనాలను ఎక్కడ పడితే అక్కడ నిలుపుతూ ఉండడం వల్ల అంబులెన్స్ రావడానికి, వెళ్ళడానికి ఇబ్బందికరంగా ఉంటోంది. ఇందుకు సంబంధించి సెక్యూరిటీ వారు ఉన్న చర్యలు శూన్యం. చెట్లు ముళ్ళ పొదలు పెరగడం వలన విష సర్పాలు బెడద కూడా ఎక్కువ అయిపోవడంతో రోగులు భయభ్రాంతులకు గురవుతున్నారు.



ఎమ్మిగనూరులోని ప్రభుత్వ ఆసుపత్రి



ఆసుపత్రి ఆవరణలో నిలిచిపోయిన మురుగు

నిత్యం 250 ఓపీలు

నిత్యం ఎమ్మిగనూరు పట్టణం నుంచే కాకుండా చుట్ట పక్కల మండలాల అయిన నందవరం, మంత్రాలయం, గోనెగండ్ల, కోసిగి, పెద్దకడబూరు మండలాల నుండి రోజుకి 250పైగా ఓపీలు వస్తుంటాయి. రోగులను పరామర్శించడానికి వందల సంఖ్యల్లో వస్తుంటారు. ప్రస్తుతం 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చెందినా పారిశుద్ధం మాత్రం పడక వేసింది. ప్రభుత్వ ఆసుపత్రిలో శానిటేషన్ కొరకు 17, సెక్యూరిటీ 7మంది సిబ్బంది పని చేస్తున్నప్పటికీ అపరిశుభ్రంగా ఉండడం గమనార్హం. సిబ్బంది ఉన్నా పరిశుభ్రత అంతంత మాత్రంగానే ఉంది. ప్రభుత్వ ఆసుపత్రి శుభ్రతకు నిలయంగా ఉండాల్సింది పోయి అపరిశుభ్రతతో కొట్టుమిట్టాడుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ఆసుపత్రి ఆవరణలో పరిశుభ్రతను ఏర్పాటు చేయాలని రోగులు కోరుకుంటున్నారు.

చర్యలు చేపడుతున్నాం



శానిటేషన్ వారు రోజు 17 మంది పని చేసున్నారు. రోజు పరిశుభ్రంగా ఉంచుతున్నారు. పబ్లిక్ కూడా కొంచెం అవగాహన ఉండాలి, శుభ్రత పాటించాలన్నారు. ఇప్పుడు వర్ష కాలం కావడం వల్ల మొక్కలు పెరుగుతున్నాయి, వాటిని ఎప్పటికి అప్పుడు వాటిని తీసేస్తున్నాము. ఇంజనీరింగ్, ఎపి ఎమ్ ఎస్‌సిడిసి పై అధికారులకు వాళ్ళకు చుట్టూ రోడ్లు, డ్రైనేజి, ప్రహరీ గోడ నిర్మాణం కోసం లెటర్ పెట్టాము. ఎప్పటికి అప్పుడు పరిశుభ్రంగా ఉంచడానికి చర్యలు చేపడుతన్నాం.

● డాక్టర్ సుధా అయ్యంగార్

విశేష పుష్పాలంకరణ



రాఘవరాయడి బృందావనాన్ని సుందరంగా అలంకరించిన దృశ్యం

మంత్రాలయం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణతో పాటు విశేష పుష్పాంకరణ, మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం చేశారు. మంగళవారం అషాఢ మాస త్రయోదశి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులతో మఠం పండితులు బృందావనానికి, గ్రామ దేవత మంచాలమ్మకు సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పండితులు హస్తోధకం చేసి మహా మంగళహారతులు చేశారు.

రాఘువేంద్రుడి సన్నిధిలో బళ్లారి జిల్లా న్యాయాధికారి: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం బళ్లారి జిల్లా న్యాయాధికారి వెంకటేష్ కుటుంబ సమేతంగా మంగళవారం రాత్రి స్వామిని దర్శించుకున్నారు. మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. అనంతపు రాణిక్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, స్వామిరాయ్ పాల్గొన్నారు.

సప్తరాత్రోత్సవాలను సమష్టిగా విజయవంతం చేద్దాం: వచ్చే నెల ఆగస్టు 8వ తేదీ నుంచి జరిగే మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాలను ప్రభుత్వ అధికారులతో కలిసి శ్రీమఠంలోని అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేసి ఉత్సవాలు విజయవంతం చేద్దామని మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తిలు అన్నారు. మంగళవారం శ్రీమఠంలో అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



నాయకులతో కలసి నినాదాలు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

జూలై 9నఎమ్మిగనూరు టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని జూలై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చే యాలని సిఐటియు మండల కార్యదర్శి రాముడు పిలుపునిచ్చారు. ప్రభుత్వం పెంచిన పని గంటలను రద్దు చేయాలని, శ్రామిక మహిళలు రాత్రి డ్యూటీలు చేయాలని నిర్ణయాన్ని రద్దు చేయాలని, వేతనాలు పెంచాలని అందు కొరకు జూలై 9న చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మెకు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖాజా, భాషసాల్మన్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ మద్దతు

ఎమ్మిగనూరు రూరల్: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఏపీ విద్యుత్ మీటర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)సంపూర్ణ మద్దతు తెలుపుతుందని విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ వీరేష్ తెలిపారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ మీటర్ రీడర్స్ గత 20ఏళ్లుగా విద్యుత్ సంస్థను నమ్ముకొని పనిచేస్తున్నారన్నారు. ఈ తరుణంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి విద్యుత్ మీటర్ రీడర్స్ కడుపు కొట్టడం దారుణం అన్నారు. విద్యుత్ సంస్థలో ఉపాధి కల్పించి, ఉద్యోగ భద్రతను కల్పించాలన్నారు.సమావేశంలో నరసప్ప, కిరణ్‌కుమార్, భీమేష్, వినోద్ లు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని రిమాండ్‌కు తరలించాలి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పెద్దకడుబూరు మండలం మూరవణి గ్రామంలో దళితులపైన దాడి చేసిన వారిని వేంటనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు సుమాల ఆంతోని, పట్టణ అధ్యక్షుడు ప్రసన్న కుమార్‌లు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజా, జయమ్మ, మాల ఉసేని, రాముడు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నందవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో పుల్లయ్య సూచించారు. మంగళవారం ముగతి గ్రామంలో కలియ తిరిగారు. గ్రామంలో చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేయకండని తెలిపారు. చెత్త బండిలు తమ ఇంటి దగ్గరకే వస్తాయని వాటిలో వేయాలన్నారు. అలాగే సీజనల్ వ్యాదులు ప్రబలే అవకాశం ఉందని మీ ఇంటి పరిసరాలను కూడా శుభ్రపరుచుకోవాలన్నారు. ఇళ్ల ముందు మురికి గుంతలు, నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. రోడ్ల మీద పశువులను కట్టేయకండని వెంటనే వాటిని మీ ప్రదేశాలో ఉంచుకునేలా చూడాలన్నారు. అలాగే గ్రామంలో ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సందీప్, నాయకులు కడుబూరి, కొండయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తాం : ఎమ్మెల్యే బీవీ



బనవాసి గ్రామంలో కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బనవాసి గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా చెన్నాపురం గ్రామంలో మొక్కలను నాటారు. అనంతరం బనవాసి గ్రామంలో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని వృద్ధులు, వికలాంగులు, వితంతువులతో మాట్లాడి ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్లు సక్రమంగా అందుతున్నాయా..లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె.టి వెంకటేశ్వర్లు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు అయ్యాళప్ప, మార్కెట్ యార్డు డైరెక్టర్ అబ్రహం, ధనుంజయ్య, రాముడు, వీరనాగప్ప, బోడబండ సురేష్, రాఘవేంద్ర, జగదీష్, చెన్నాపురం నాగరాజు, ఏపీడీ అల్లిపీర, తహసీల్దార్ శేషఫణి, ఏపీవో విజయ్‌మోహన్, జేఈ నూర్జహాన్, బషీర్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: కూటమి ప్రభుత్వ పాలనలో రాజకీయలకు అతీతంగా అర్హులైన అందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కంబదహాల్, జాలవాడి గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలలో రాష్ట్రం అధోగతి పాలైందని, కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో తల్లికి వందనం, దీపం పథకం, మెగా డీఎస్సీ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రకామాంతరెడ్డి, మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, సొసైటీ చైర్మన్ మీసేవా ఆంజనేయులు, యేసేపు, మురళికృష్ణ , మల్లకల్, ముక్కన్న, భీమన్న, హనుమన్న, నరసింహాలు, ఏపీడీ లోకేశ్వర్, ఈవోపీఆర్డీ జయరాముడు, ఏపీవో చంద్రశేఖర్, ఎంపీడీవో ప్రభావతి, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

నందవరం: సుపరిపాలన ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ జిల్లా ఉపాధ్యాక్షుడు, క్లస్టర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేశాయి మాదవరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన నందవరంలో ఇంటింటికి వెళ్లి సుపరిపాలనలో తొలి అడుగు గురించి ప్రజలకు వివరించారు. చంద్రబాబు చేసిన ఎన్టీఆర్ పింఛన్ భరోసా, తల్లికి వందనం, దీపం పథకంలాంటివి ప్రజలకు ఇచ్చిన విజన్ ఉన్న వ్యక్తి అని అన్నారు. ప్రజలకు కావాల్సి పథకాలు ప్రవేశపెట్టి అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. ఉచిత బస్సు సౌకర్యం, అన్నదాత సుఖీభవ పథకం త్వరలో ప్రారంబిస్తారన్నారు. కార్యక్రమంలో తెలుగు ఈరన్న, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మల్లికార్జున, నరసింహాలు పాల్గొన్నరు.

జనసేనకు న్యాయమైన వాటా ఇవ్వాలి

మంత్రాలయం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి భాగస్వామ్యంలో జనసేన పార్టీకి రావాల్సిన న్యాయమైన వాటా ఇవ్వాల్సిందేనని మంత్రాలయం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బి.లక్ష్మన్న అన్నారు. మంగళవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గంలో జనసేన పార్టీకి రావాల్సిన వాటా ప్రకారం నామినేటెడ్ పదవులు రావడం లేదని వాపోయారు. ఇప్పటి వరకు నామినేటెడ్ పదవులైన రేషన్ డీలర్లు, బుక్ కీపర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు, దేవాదాయ శాఖ చైర్మన్లు, మెంబర్లు జనసేనకు ఇవ్వాలని కోరారు. ఇందుకు తిక్కారెడ్డి సానుకూలంగా స్పందించి రాష్ట్ర అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి వాటా వచ్చే విదంగా చర్యలు తీసుకుంటామని తిక్కారెడ్డి హామీ ఇచ్చారన్నారు.

యూరియా కొరత లేకుండా చూస్తాం: టీడీపీ

నందవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత లేకుండా చూస్తామని టీడీపీ నాయకులు బడేసాబ్ వలీ అన్నారు. మంగళవారం మండలంలోని మాచాపురం గ్రామంలో క్లష్టర్ ఇన్‌చార్జ్ కాశీంవలీ ఆదేశాల మేరకు రైతు సేవ కేంద్రం దగ్గర రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డితో మాట్లాడి రైతులకు ఎరువుల గురించి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు. గ్రామంలో అన్ని రకాల ఎరువుల మందులు రైతు సేవ కేంద్రంలో అందుబాటులో ఉండేవిధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు రంజాన్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక



వైసీపీ కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలోని పెద్దకడబూరు మండలం పులికనుమ గ్రామంలోని 20 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరారు. మంగళవారం రాత్రి మండలంలోని మాధవరం గ్రామంలో టీడీపీనియోజకవర్గం ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డి నివాసంలో హెబ్బటం చెన్నబసప్ప, దాసప్ప, నారాయణ, రాగన్న, ఈరన్న, కోసిగయ్య, ఎరిగేరి లింగన్న, గౌళ్ల ముక్కరయ్య, బసవరాజు, ఈరన్నలు వైసీపీ నుంచి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం చూసి టీడీపీలోకి చేరుతున్నట్లు వారు తెలిపారు. వీరికి టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి రాఘవేంద్రరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు రఘునాథరెడ్డిలు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామకృష్ణ, వంశీ, గుర్మింటి భీమిరెడ్డి, నాగరాజు, బూదిరెడ్డి, రామయ్య, జయరాం, కేశన్న, బొజ్జప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

పెద్దకడుబూరు , జూలై 8(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల గుండెల్లో నిలిచిన మహనేత వైఎస్సార్ అని వైసీపి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బాపులదొడ్డి గ్రామంలోని వైఎస్సార్ 76వ జయంతి వేడుకల సందర్భంగా వైఎస్సార్ విగ్రహ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో వైసీపి నాయకులు పురుషోత్తం రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, జాము మూకయ్య, మహదేవ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: ఎమ్మిగనూరు టౌన్‌లో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైసీపి ఎమ్మిగనూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక వైఎస్‌ఆర్ సర్కిల్‌లోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి అనంతరం కేక్ కట్ చేసి ఘన నివాళులు అర్పించారు కార్యక్రమంలో బుట్టా నీలకంఠ, ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, నాగేషప్ప, కోటకొండ నరసింహులు,కోమ్ము రాజశేఖర్, పాలశ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ కాశింవలి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షబ్బీర్, నరసప్ప, కాశిం, ఆసీఫ్, హాజరత్, సాయి, హర్ష, రఫిక్, అజయ్‌లు పాల్గొన్నారు.

మంత్రాలయం:నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షులు, జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ గురెడ్డి భీమిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ సీవీ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాఘవేంద్ర సర్కిల్‌లో కేక్ కట్ చేసి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, కురువ మల్లికార్జున, జనార్దన్ రెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్ శెట్టి, జగదీష్, దానియేలు, వీరారెడ్డి, హోటల్ పరమేష్, రామాంజనేయులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి